ఆంధ్రజ్యోతి 1 ప్రకాశం
ఆదివారం 5, జనవరి 2025



నేడే గిద్దలూరులో 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

గిద్దలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో ఆదివారం గిద్దలూరులో జరగనున్నాయి. అందుకు రిక్రియేషన్ క్లబ్ రోడ్డులోని టెన్నిస్ కోర్టు ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గ్రైండర్ ఇవ్వనున్నారు. లక్ష్మీ డెయిరీ వ్యవస్థాపకులైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తారు.



కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ఒంగోలు పీవీఆర్ హైస్కూలులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

అవనిపై హరివిల్లు

అవనిపై హరివిల్లు ఆవిష్కృతమైంది. నింగిలోని చుక్కలు నేలను తాకి సప్తవర్ణ శోభితమయ్యాయి. ముత్యాల ముగ్గులుగా ఒదిగాయి. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా సామాజిక అంశాలను మేళవిస్తూ మహిళలు వేసిన రంగవల్లులు అబ్బురపరిచాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకారంతో ఒంగోలు, కనిగిరిల్లో శనివారం నిర్వహించిన పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒంగోలులో పోటీలకు శ్రీసరస్వతీ విద్యా సంస్థలు, కనిగిరిలో అమరావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (గుంటూరు) ఎండీ, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరించారు. కనిగిరిలో కలెక్టర్ అన్సారియా, ఒంగోలులో ఎస్పీ దామోదర్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
ఒంగోలు, కనిగిరిల్లో నిర్వహణ
పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. ఆకాశంలో చుక్కలను మహిళలు నేలకు దించడంతో పామూరురోడ్డులోని అమరావతి గ్రౌండ్ ముత్యాల ముగ్గులతో మెరిసిపోయింది. రమణీయమైన రంగవల్లులతో పుడమి పులకించింది. కనిగిరి నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 315మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. ఎవరికి వారే అన్నట్లుగా పోటీపడి రంగుల హరివిల్లును ఆవిష్కరించారు. వెలిగండ్ల మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన సిరివెళ్ల కవితకు ప్రథమ, అద్దంకికి చెందిన పేపర్తి పూజితకు ద్వితీయ, పొదిలికి చెందిన కొప్పాక విజయలక్ష్మికి తృతీయ బహుమతి లభించాయి. విజేతలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేల నగదును ఇచ్చారు. ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున ప్రోత్సాహక నగదును అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 315 మంది మహిళలకు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను అందజేశారు.

ఒంగోలు కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రమణీయమైన రంగవల్లులతో ఒంగోలులోని పీవీఆర్ బాలుర మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణం కళకళలాడింది. శనివారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. 100 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. వారు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా, సందేశాత్మకంగా వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాశాల విద్యార్థినులు కూడా పాల్గొని వారి అభిరుచులు ఉట్టిపడేలా ఉత్సాహంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతగా ఎం.ప్రత్యూష, ద్వితీయ విజేతగా పి.జానకి నిలిచారు. తృతీయ బహుమతిని కె.సుబ్బలక్ష్మి సాధించారు. ప్రథమ బహుమతిగా ఎల్ఈడీ స్మార్ట్ టీవీ, ద్వితీయ బహుమతిగా వాషింగ్ మెషిన్, తృతీయ బహుమతిగా ట్రావెలర్స్ లగ్జరీ సూట్‌కేస్‌లను ఎస్పీ దామోదర్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి అందజేశారు. 10 మందికి ప్రోత్సాహక, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సరస్వతీ విద్యాసంస్థల తరఫున కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.



ఒంగోలులో ముగ్గు వేస్తున్న వృద్ధురాలు

'ఆంధ్రజ్యోతి' అంటేనే సంస్కారం
చిరివెళ్ల కవిత, ప్రథమ బహుమతి విజేత



ఆంధ్రజ్యోతి అంటేనే సంస్కృతి, సంస్కారం. సంప్రదాయాలను నేటి తరానికి, భవిష్యత్ తరాలకు తెలిపేలా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం గొప్పగా ఉంది. నాలుగేళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నాను. గత ఏడాది కూడా ప్రథమ బహుమతి లభించింది.

ఎంతో ఆనందంగా ఉంది
పేపర్తి పూజిత, ద్వితీయ బహుమతి విజేత



ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరికీ సమస్యలు వస్తుంటాయి. ఆ సమస్యలే చుక్కలుగా వేసి మెలికలతో వాటిని అందంగా తప్పించుకునేలా ప్రస్ఫుటించడమే ముగ్గులోని ప్రధాన భావన.



కనిగిరిలో ముగ్గులను తిలకిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి



ఒంగోలులో ముగ్గులను తిలకిస్తున్న ఎస్పీ దామోదర్, సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి

రాష్ట్ర స్థాయిలో గెలుపొందాలన్నదే లక్ష్యం
ఎం.ప్రత్యూష, ప్రథమ బహుమతి విజేత



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలను ప్రోత్సహించడం అభినందనీయం. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలన్నదే నా లక్ష్యం. నాకు చిన్నప్పటి నుంచి ముగ్గులంటే ఎంతో ఇష్టం. అటువంటి ముగ్గుల పోటీలో విజేతగా నిలవడం ఆనందంగా ఉంది.

మహిళలకు ప్రోత్సాహకరం
పి.జానకి, ద్వితీయ బహుమతి విజేత



ముగ్గుల పోటీలతో మహిళల్లో సృజనాత్మకత, పోటీతత్వం వెలికివస్తాయి. ఈ పోటీలు ఎంతో ప్రోత్సాహకరం. ఏటా ఈవిధంగా పోటీలను నిర్వహించి ఎంతో మంది మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి అభినందనలు.



కనిగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర, ఆంధ్రజ్యోతి బీఎం సుబ్బారావు



ఒంగోలులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తున్న ఎస్పీ దామోదర్, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి అళ్ల శ్రీనివాసరావు, స్టాఫ్‌రిపోర్టర్ కోనూరి శ్రీనివాసరావు

చాలా ఆనందంగా ఉంది
కె.సుబ్బలక్ష్మి, తృతీయ బహుమతి విజేత



ముగ్గుల పోటీలలో తృతీయ స్థానం పొందడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ముగ్గులను ప్రాక్టీసు చేస్తుంటాను. అందుకు తగిన ఫలితం ఈ రోజు లభించిందని అనుకుంటున్నాను. నేను వేసిన ముగ్గులో కాన్సెప్ట్‌కు ఈ బహుమతి లభించిందని భావిస్తున్నాను.

సంప్రదాయాలను తెలిపే గొప్ప కార్యక్రమం
కొప్పాక విజయలక్ష్మి, తృతీయ బహుమతి విజేత



నేటి ఆధునిక యుగంలో సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. భావితరాలకు తెలుగువారి పండుగలు తెలియకుండా పోతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిస్తోంది.

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బారావు సస్పెన్షన్!

మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించినందుకు చర్యలు

పాఠశాల విద్య ఆర్జేడీ ఉత్తర్వులు

పనిచేసిన చోటల్లా వివాదాస్పదమే!

3

ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

జిల్లావ్యాప్తంగా మొదలు

4,145 మంది విద్యార్థులకు వర్తింపు

కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి ప్రారంభించిన కలెక్టర్

ఆయా ప్రాంతాల్లో పాల్గొన్న నేతలు

2

ఆడపిల్లలకు అండగా పోలీస్



కనిగిరిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

- జిల్లావ్యాప్తంగా మొదలు
- 4,145 మంది విద్యార్థులకు వర్తింపు
- కనిగిరిలో ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి ప్రారంభించిన కలెక్టర్
- ఆయా ప్రాంతాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 2,145 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ భోజన పథకం అమల్లోకి వచ్చింది. కనిగిరి జూనియర్ కళాశాలలో అక్కడి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాలలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్, దర్శిలో ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు.



జెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న నాయకులు

నేటినుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలో ఆదివారం నుంచి ఈనెల 8వతేదీ వరకు జరగనున్న యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద శనివారం జెండా ఊపి జిల్లా జాతాను ఆయన ప్రారంభించారు. తిరుపతి, నెల్లూరు జాతాలతో కలిసి ప్రకాశం జిల్లా జాతా విజయవాడ, ఏలూరు, రాజమండ్రి మీదుగా కాకినాడ నగరానికి చేరుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ స్వర్ణోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గౌరవాధ్యక్షుడు. ఎస్.రవి మాట్లాడుతూ ఈ మహాసభలకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హై, ఎన్.చిన్నస్వామి, పి.రాజసులోచన, నల్లూరి వెంకటేశ్వరరావు, హరిబాబు, నరసింహారావు, నారాయణ, ఖాసీంవలి, ఎ.తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, జేవీవీ ప్రధానకార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాస్థాయిలో చినారికట్ల విద్యార్థుల సత్తా

కొనకనమిట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శుక్రవారం విద్యాశాఖ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో చినారికట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు బీకోటిరెడ్డి మాట్లాడుతూ రైతుల పొలాల చుట్టూ కోతులు, అడవి జంతువులు ప్రవేశించకుండా ఫెన్సింగ్ వేసి కరెంట్ సరఫరా ఇస్తున్నారని, దీని ద్వారా పంటపొలాలను కాపాడుకోవాలని ఉద్దేశంతో రైతులు చేస్తున్నారని, ఫలితంగా విద్యుత్ కంచె వల్ల అడవి జంతువులకు, మనుషులకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల పదవతరగతి విద్యార్థులు మారవతు వర్షనాగసాయి. బరిగే వీరేంద్ర, రైతుల సలహాలతో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గుంటూరి ఐజాక్‌బాబు సూచనలు, సలహాల మేరకు మానవీయ కంచె అనే ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో సోలార్, బ్యాటరీ సహాయంతో 9 ఓల్ట్‌ల విద్యుత్ కంచెకు సరఫరా అయ్యేలా ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. ప్రాజెక్ట్ వలన అడవి జంతువులు, మానవులకు ప్రాణహాని ఉండదని పంటలను పరిరక్షించుకోవచ్చన్నారు. ఒంగోలులో 3వ తేదీన జరిగిన సైన్స్‌ఎగ్జిబిషన్‌లో వారు రూపొందించిన ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. ఈప్రాజెక్ట్‌కు కొనకనమిట్ల మండలం చినారికట్ల జిల్లాపరిషత్‌ఉన్నతపాఠశాలల విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్‌కుమార్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన నాగసాయి, వీరేంద్రలను, గైడ్‌టీచర్ గుంటూరి ఐజాక్‌లను ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రథమస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. తెలుగు ఉపాధ్యాయుడు రామారావు, ఇరువురు విద్యార్థులకు రూ. 2000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

కావూరివారిపాలెంలో క్షుద్రపూజ కలకలం

- హడలెత్తిన ప్రజలు
- రీల్స్‌కోసం అని తెలిసి నవ్వుకున్న వైనం

కావూరివారిపాలెం (చీరాలటౌన్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెంలో శనివారం తెల్లవారుజామున క్షుద్రపూజ కలకలం రేపింది. ఆంధ్రకేసరినగర్ గ్రామ నడిబొడ్డులో ముగ్గు వేసి ఉంది. ఆ ముగ్గు మధ్యలో అక్కడక్కడా గేదె వెంట్రుకలు, నిమ్మకాయలు, మిరపకాయలు కూడా ఉన్నాయి. గ్రామంలో అధిక శాతం కూలీనాలీ చేసుకుని జీవించే వారు కావడంతో నాలుగు గంటలకే రోడ్డుమీదికి వచ్చారు. రోడ్డుపై ముగ్గు వేసి ఉండడం చూసి ఇది చేతబడి ముగ్గంటూ హడలెత్తారు. అసలేం జరుగుతుంది.. ఇప్పుడేమి చేయాలని ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో అప్పుడే నిద్రలేచి కళ్లు నలుపుకుంటూ వచ్చిన ఓ పోరగాడు ఇది యూట్యూబ్‌లో రీల్స్ కోసం రాత్రి మేమే వేశామని తాపిగ్గా చెప్పాడు. దీంతో అందరూ నవ్వుకుంటూ ముక్కున వేలేసుకున్నారు. పోరగాడికి చీవాట్లు పెట్టారు. ఈ మధ్య కాలంలో యువత రీల్స్ మోజులో పడి లైకుల కోసం ఇలాంటి చేష్టలు చేయడం పరిపాటిగా మారింది.

ఆడపిల్లలకు అండగా పోలీసు

- అత్యవసరమైతే డయల్ 100కి కాల్ చేయండి
- ఎస్పీ దామోదర్ సూచన



కళాశాల విద్యార్థినులతో ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), జనవరి4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆడపిల్లలు పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని పీవీఆర్ గ్రౌండ్‌లో జరిగిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులను విద్యార్థినులు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మోసపూరితమైన మాటలకు ఆకర్షితులు కావద్దని కోరారు. తల్లిదండ్రుల కోరికలకు అనుగుణంగా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘీక కార్యక్రమాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదే సమయంలో ఆడపిల్లలు తమకు ఎలాంటి అత్యవసరమైన పరిస్థితి ఏర్పడినా డయల్-100, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేస్తే పోలీసులు రక్షణగా ఉంటారని భరోసా కల్పించారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఎంపిక పోటీలు

- 144 మంది మహిళా అభ్యర్థులు రాత పరీక్షలకు ఎంపిక

ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానం కానిస్టేబుళ్ల ఎంపిక పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం మహిళ అభ్యర్థులు 221 మంది దరఖాస్తు చేసుకోగా 114 మంది రాత పరీక్షకు ఎంపికైనట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక పోటీలు పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరూ దళారుల మాటలు నమ్మవద్దని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏవో రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళా భక్తులు

చీమకుర్తిలో వేంకటేశ్వర వైభవం

- కనులపండువగా కలశాభిషేక వేడుక
- ఉత్సాహంగా నగరోత్సవం

చీమకుర్తి, జనవరి4(ఆంధ్రజ్యోతి) : గోవింద నామస్మరణతో చీమకుర్తి పట్టణం మార్మోగిపోయింది. గోవింద భక్తజన బృందం ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరిగే గోవింద కలశాభిషేకాల వేడుక శనివారం కనులపండవగా జరిగింది. పట్టణంలోని ఇసుకవాగు సెంటర్‌లో ఉన్న శ్రీకృష్ణమందిరం నుంచి 516 కలశాలతో మహిళలు ఊరేగింపుగా హరిహరక్షేత్రం వద్దకు చేరుకున్నారు. ఇక్కడి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు హరికుమారాచార్యులు, టీటీడీ వేదపండితులు పర్యవేక్షణలో స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. కలశాలతో తీసుకువచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించిన తదుపరి స్వామివారికి ఏడాదికి ఒకసారి నిర్వహించే చందనాలంకరం చేశారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు హాజరై పూజలు జరిపారు. సాయంత్రం పట్టణంలో నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. చిన్నారుల జ్యోతుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దీంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో చలువాది బదరినారాయణ, మారం వెంకారెడ్డి, సోమా శ్రీనివాసరావుగురుస్వామి, పిల్లి రామకృష్ణ, చింతగింజల శ్రీనివాసరావు, గుంజి సుబ్బారావు, రామారావు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యాలయంలో తనిఖీ

- క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్‌కు పునాది
- మెను ప్రకారం శుచి,రుచిగా భోజనం అందించాలి
- డీఈవో పురుషోత్తం



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

బల్లికురవ. జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్‌కు పునాది వేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.పురుషోత్తం అన్నారు. గత నెల 27వ తేదీన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'విద్యార్థులకు వంట కష్టాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై డీఈవో స్పందించారు. ఈ మేరకు ఆయన శనివారం కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వంట చేసే పోస్టులు రెండు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులే కొన్ని రోజులు వంట చేసి పెట్టారని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా, అయన ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట కొత్త వారిని నియమించామని తెలిపారు. మెనూ ప్రకారం శుచి, రుచిగా భోజనం అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ చదువుతో పాటు తల్లిదండ్రులు మీపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్ట పడి చదవాలన్నారు. బడి మానేసిన విద్యార్థినులకు ఏర్పాటు చేసిన విద్యాలయంలో అన్ని వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయనతోపాటు ఏఎస్‌వో శ్రీనివాసరావు, ఎంఈవో కె.రమేష్, ప్రిన్సిపాల్ సరళకుమారి ఉన్నారు.

మార్టూరులో దొంగల హల్‌చల్

- అపార్ట్‌మెంట్‌తో పాటు మరో ఇంటిలో చోరీకి ప్రయత్నం
- పరిశీలించిన క్లూస్ టీం

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) :మార్టూరులో నాగరాజుపల్లి రోడ్‌లో సాయి మల్లికార్జున అపార్టమెంట్‌లో శనివారం అర్ధరాత్రి 2 గంటల తర్వాత ముగ్గురు దొంగలు హల్ చల్ చేశారు..అక్కడ దొంగతనం చేసే అవకాశం లభించకపోవడంతో అపార్టమెంట్ ఎదురుగా రోడ్డుకు అవతలవైపు ఉన్న దండా నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో చోరీ చేయడానికి ప్రయత్నించారు. కానీ వారికి ఈ ఇంటిలో ఎలాంటి వస్తువులు కాని నగదు కాని లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఈ తతంగం అంతా 2 గంటల 20 నిమిషాలు నుంచి సుమారు 3 గంటల 20 నిమిషాలు వరకు జరిగినట్లు అపార్టమెంట్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలన లో వెల్లడయ్యింది. అంటే దాదాపుగా గంటకు పైగా దొంగలు హల్‌చల్ చేసినట్లు సమాచారం.

అపార్టమెంట్‌లో అన్నిఫ్లోర్లూ వెదికారు

సీసీ పుటేజీలో నమోదయిన వివరాలు ప్రకారం 2 గంటల 20 నిమిషాలకు ముగ్గురు దొంగలు అపార్టమెంట్ లోపలకు ప్రవేశించారు.ఈ అపార్టమెంట్ లో 5 ఫ్లోర్లు,వాటిలో 30 గదులు ఉన్నాయి. అయితే దొంగలు లోపలకు ప్రవేశించే సమయంలో రెండు సీసీ పుటేజీలకు చెందిన వైర్లు కత్తిరించినప్పటికీ ఇంకా నాలుగు సీసీ పేటేజీలను వారు గమనించలేదు.దాంతో దొంగలు కదలికలు సీసీ పుటేజీలో నమోదయ్యాయి. వారు దాదాపుగా అన్ని ఫోర్లులో తిరిగారు. వారిలో ఒక వ్యక్తి ముఖానికి మాస్క్‌తో ఒక చేతిలో మారణాయుధంతో రెండవ ఫ్లోర్‌లో తిరిగిన దృశ్యాలు మనకు సీసీ పుటేజీలో కనిపించాయి. ఈ సమయంలో అపార్టమెంట్‌లో గదులలో ఉన్న వారంతా గాఢ నిద్రలో ఉండడం, ఎవరూ బయటకు రాకపోవడంతో దొంగలు నిర్భయంగా అపార్టమెంట్ అంతా కలియతిరిగారు. దాదాపుగా 40 నిమిషాలు గడిచిన తర్వాత దొంగలు అపార్టమెంట్ పడమర వైపు ఉన్న గేటు గుండా బయటకు వచ్చి రోడ్డుపై వేగంగా పరుగెత్తుతూ, దండా నాగేశ్వరరావు ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటి యజమాని నాగేశ్వరరావు కుటుంబం కర్నాటకలో పొలం సాగుచేసుకోవడానికి వెళ్లడంతో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాను తెరచి అందులో విలువైన వస్తువులు లేకపోవడంతో దుస్తులను చిందర వందర చేసి వెళ్లిపోయారు. అయితే ఈ సమయంలో వాకిలి వద్ద రోకలిబండతో ఒక వ్యక్తి కాపలాగా ఉన్నట్లు వారు అ క్కడ వదిలివేసిన రోకలిబండ మనకు కనిపించింది.

ఫోన్ చేసిన నాగేశ్వరరావు

గతంలో ఆరు నెలలు కిందట నాగేశ్వరరావు ఇంటిలో చోరీ జరిగింది. అతను కర్నాటకలో పొలంసాగు చేయడానికి వెళ్లడంతో ఈ ఇంటిలో ఎవరూ లేరు. అయితే అతను ఇంటి ముందు సీసీ పుటేజీలను ఏర్పాటు చేయడంతో శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు సీసీ పుటేజీలో ఇంటికి సంబంధించి కనిపించిన దృశ్యాలు 3 గంటల తర్వాత కనిపించకపోవడంతో నాగేశ్వరరావు అపార్ట్‌మెంట్‌లో ఉన్న వాచ్‌మన్ శ్రీనివాసరావుకు తన ఇంటిలో ఏదో జరిగిందని ఫోన్ చేశారు. దాంతో వాచ్‌మన్ శ్రీనివాసరావు అపార్టమెంట్‌లోని అందరినీ నిద్రలేపడం, వారంతా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి చూడడం, అక్కడ దొంగతనం జరిగిందని గ్రహించి, తర్వాత తమ అపార్టమెంట్ సీసీ పుటేజీలను పరిశీలించగా, దొంగలు మొదట తమ దగ్గరకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని సెంటరులో బీట్ నిర్వహిస్తున్న పోలీసులకు చెప్పడంతో వార వచ్చి పరిశీలించారు. సాయంత్రం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు.

మైనంపాడు డైట్‌లో జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు

సంతనూతలపాడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జిల్లాస్థాయి రంగోత్సవ్‌పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోల్‌ప్లే, ఏక్‌భారత్-శ్రేష్ఠభారత్‌పై స్లోగన్లు తయారీ, ఆంధ్రప్రదేశ్ జానపదనృత్యాలు, చేతిరాత పోటీలు, రంగోలి పోటీలు, దేశ జాతీయ నాయకుల చిత్రాలు గీయడం, ఏపీ చరిత్ర, సంస్కృతి, భూగోళశాస్త్రంపై క్విజ్‌పోటీలు వంటి అంశాలపై అన్ని ప్రభుత్వ, కేంద్రీయ, ప్రైవేట్, ఎయిడెడ్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 6వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులందరు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.



బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ గోపాలకృష్ణ

అంధుల సమస్యల పరిష్కారానికి కృషి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న బ్రెయిలీ విగ్రహానికి జేసీ గోపాలకృష్ణ, సహాయసంచాలకులు జి.అర్చన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ బ్రెయిలీ అంధుల కోసం చేసిన కృషిని కొనియాడారు. అంధులకు జిల్లా అధికార యంత్రాంగం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు టి.రవికుమార్, అంజల, ఆదిలక్ష్మి, ఝాన్సీ, సుశీల, రవితేజ, పాఠశాల గేమ్స్ సెక్రటరీ మహ్మద్ హాజీరబేగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి జేసీ గోపాలకృష్ణ బహుమతులు అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



రహదారి పక్కన ఉన్న బంకులకు కొలతలు వేయిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

రహదారిని సర్వే చేసిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్'

మార్కాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారిని రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేశారు. 'చట్టాలు పేదలకేనా.. పెద్దలకు వర్తించవా?' శీర్షికన ఈ నెల 4వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సాయంత్రం వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం 5.00 గంటలకు తహసీల్దార్ చిరంజీవి సర్వే సిబ్బందితో కలిసి రహదారి మొత్తం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ రహదారి ప్రారంభం నుంచి చెరువు సప్లైచానల్ వరకు సర్వే నెంబర్ 395/బిలోని 1.50 ఎకరాలను ర్యాండమ్‌గా సర్వే చేశారు. ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రహరీలను హద్దుగా చేసుకుని రహదారికి ఉత్తరం వైపున ఎంతమేర ఆక్రమణలు చోటుచేసుకున్నాయో కొలతలు వేసి చూశారు. పక్కనున్న సర్వేనంబర్‌లలోని హద్దుల నుంచి కూడా ఇంకా పూర్తిస్థాయిలో సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు చోటుచేసుకుంటే విషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలియజేస్తామన్నారు. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి ఆక్రమణలను తొలగించుకోకుంటే తప్పక తీసేస్తారన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సంజీవయ్య, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కారం

- మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాలను నిర్వహిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. సంతమాగులూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 147 మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో భర్తను,మరిదిని కోల్పోయి తీవ్రగాయాలతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్లు రాంబాబు భార్య ఉమ (22) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా శనివారం తెలిపారు. ఆమె మృతదేహానికి సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నూతన సంవత్సరం రోజు జాతీయరహదారిపై విజయవాడ నుంచి ద్విచక్రవాహనంపై ధర్మవరం వెళుతున్న ముగ్గురిని లారీ ఢీకొనగా, ఆ ప్రమాదంలో తోడల్లుళ్లు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా వారిలో రాంబాబు భార్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆమె గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కనిగిరిలో జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ముగ్గుతో విజేత చిరువెళ్ల కవిత


చిన్నారిని పక్కన కూర్చోబెట్టి ముగ్గు వేస్తున్న యువతి


ఒంగోలు పీవీఆర్ గ్రౌండ్‌లో జరిగిన పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన ముగ్గుతో విజేత ఎం. ప్రత్యూష


ముగ్గు చుట్టూ ఓ మహిళ రాసిన వివిధ రకాల నినాదాలు

సంప్రదాయాలను చాటిన ముగ్గులు

- ఆంధ్రజ్యోతి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి పత్రికా సంస్థ ముత్యాలముగ్గుల పోటీలు నిర్వహించి సంక్రాంతి పండుగను ముందే తెచ్చిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌ఆధ్వర్యంలో నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్ - ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెలినయా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) వారి సౌజన్యంతో, అమరావతి మెడికల్ సైన్సెస్ గుంటూరు ఎండీ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో ముగ్గుల పోటీలు వైభవంగా జరిగాయి. బహుమతి ప్రదానోత్సవ సభలో కలెక్టర్ విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన రావడం సంస్కృతి సంప్రదాయల విలువలను మరింత పెంచిందన్నారు. మహిళలు వేసిన రంగవల్లులు ఎంతో అందంగా ఉన్నాయన్నారు. భావి తరాల వారికి సనాతన ధర్మాలను, సంప్రదాయలను తెలియజేసే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అనుభూతిని ఇస్తాయన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఆడపడుచులను ప్రోత్సహించటమే లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఆడపడుచులను ప్రోత్సహించటమే తన ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బహుమతుల ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం అన్నిరంగాల్లో ముందుండాలన్నదే తన సంకల్పమన్నారు. మహిళా సంక్షేమానికి మహిళలను ప్రోత్సహించే కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. మహిళలకు అండగా ఉంటానన్నారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టిందని అభినందించారు. తాను ఆంధ్రజ్యోతి పత్రికకు ఆయా సంస్థ యాజమాన్యానికి రుణపడి ఉంటానన్నారు. తనను వెన్నుతట్టి, వెన్నుదన్నుగా నిలిచి రాజకీయ ప్రయాణానికి ఎంతో సహకారం అందించిన విషయాన్ని గుర్తుంచుకుంటానన్నారు. ఆంధ్రజ్యోతి ఒంగోలు బ్రాంచి మేనేజర్ ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌దానియేలు, సీఐ ఖాజావలి, ఎస్‌ఐలు మాధవరావు, శ్రీరాం, టీడీపీ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, జంషీర్ అహ్మద్, తెలుగుమహిళలు కరణం అరుణ, షేక్ వాజిదాబేగం, తులసి, నారాయణమ్మ, నీరజ, స్వప్న, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




ముగ్గుల పోటీల బహుమతి ప్రదానంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా (ఇన్‌సెట్లో) ఉత్సాహంగా ముగ్గువేస్తున్న వృద్ధురాలు



తెలుగు సంస్కృతికి ప్రతీక రంగవల్లులు

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీని అభినందించిన ఎస్పీ దామోదర్
- మహిళలను ప్రోత్సహించటం అభినందనీయం : కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(కల్చరల్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): రంగవల్లులు తెలుగు సంస్కృతికి ప్రతీక అని, తెలుగువారికి అతి పెద్ద పండుగ అయిన సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటి ముందు మహిళలు అందంగా తీర్చిదిద్దిన రంగవల్లులు కనిపిస్తాయని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఏఆర్ దామోదర్ అన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతల బహుమతి ప్రదానంలో ఆయన ఎస్పీ దామోదర్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు నిర్వహించటం ఆనందంగా ఉందని అన్నారు. అదేవిధంగా యువత సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గులపోటీలు నిర్వహిస్తూ మహిళల్లో సృజనాత్మకతకు గుర్తింపునిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాము సైతం భాగస్వాములు కావటం ఆనందంగా ఉందని సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి అన్నారు. పోటీలలో న్యాయనిర్ణేతలుగా మారేపల్లి సూర్యకుమారి, బి.అమ్ములు, బీరం అరుణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 మందికి ప్రోత్సాహక బహుమతులు, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గిఫ్ట్‌ను సరస్వతీ విద్యాసంస్థల తరఫున రమణారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాసరావు, స్టాఫ్ రిపోర్టర్ కోనూరి శ్రీనివాసరావు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ వెంకట్రావు, అడ్వర్‌టైజింగ్ విభాగం ఇన్‌చార్జి గోపీకృష్ణ ప్రసాద్, సర్కులేషన్ ఇన్‌చార్జి వెంకట్, రిపోర్టర్లు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల బహుమతి ప్రదానంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందిస్తున్న రమణారెడ్డి (ఇన్‌సెట్లో) ముగ్గుకు రంగులు అద్దుతున్న యువతి


పీవీఆర్ గ్రౌండ్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు


కనిగిరిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత పూజిత


కనిగిరిలో తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత విజయలక్ష్మి


ఒంగోలులో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత పి. జానకి


ఒంగోలులో తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత కె.సుబ్బలక్ష్మి

నేడు డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించేందుకు 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుమార్తెలు అనీషాలక్ష్మి, తనూజాలక్ష్మిలు తెలిపారు. శనివారం స్థానిక దామచర్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ ఆదివారం ఉదయం 9-30 గంటలకు 5వ తరగతి విద్యార్థులకు ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉత్తమ మార్కులు సాధించిన వారికి 6 నుంచి 10వ తరగతి వరకు వారు చదివే స్కూలులో డీజేఆర్ ట్రస్ట్ ద్వారా పూర్తి ఫీజు చెల్లిస్తామని, అలాగే ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు అందజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని, వివరాలకు సెల్ : 8498888948 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బారావు సస్పెన్షన్!

మహిళా టీచర్ల పట్ల దురుసు ప్రవర్తనకు చర్యలు

పాఠశాల విద్య ఆర్జేడీ ఉత్తర్వులు

పనిచేసిన చోటల్లా వివాదాస్పదమే!

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించిన మైనంపాడు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావుపై వేటుపడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలులోని రామచంద్రమిషన్‌లో టీచర్లకు శిక్షణ జరుగుతోంది. ఈ సందర్భంగా సుబ్బారావు వ్యవహార శైలి, ప్రశ్నించారని ఉపాధ్యాయురాళ్లను పురుష టీచర్ల మధ్యలో కూర్చోబెట్టిన వైనంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఆర్జేడీ స్పందించారు. శనివారం శిక్షణ కేంద్రానికి వచ్చిన ఆయన ఉపాధ్యాయులను విచారించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది ఉపాధ్యాయులు సోమా సుబ్బారావుపై ఫిర్యాదులు చేశారు. అక్కడ ఏం జరిగిందన్న విషయాన్ని లిఖితపూర్వకంగా కూడా ఆర్జేడీకి ఉపాధ్యాయులు రాసి ఇచ్చారు. సుబ్బారావు మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించిన విషయం వాస్తవమని తేలడంతో ఆయన్ను ఆర్జేడీ సస్పెండ్ చేశారు. సుబ్బారావు గతంలోనూ తాను పనిచేసిన చోటల్లా వివాదాస్పదునిగా గుర్తింపు పొందారు. సర్వశిక్షా అభియాన్‌లో పనిచేసే సమయంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. డైట్ లెక్చరర్‌గా ఉన్న సమయంలో డీఈడీ కళాశాలలకు అనుమతులు, ప్రాక్టికల్ పరీక్షల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కందుకూరు ఉప విద్యాధికారిగా పనిచేసినప్పుడు అక్కడ కార్యాలయానికి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులు పొందిన వారు ఇచ్చిన ఫర్నిచర్‌ను ఒంగోలులోని తన ఇంటికి తరలించారు. ఇది వివాదాస్పదం కావడంతో ఆ సామగ్రిని తిరిగి కందుకూరు కార్యాలయానికి చేర్చారు.

ఓపెన్ స్కూలు ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు విద్య, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 6వరకు, రూ25 రుసుంతో ఈనెల 8 వరకు, రూ.50 రుసుంతో ఈనెల 9వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. తాత్కాల్ పథకం కింద రూ.500 అపరాధ రుసుంతో పదో తరగతి, రూ.1000 రుసుంతో ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్లు తమ స్టడీ సెంటర్లలో ప్రవేశం పొందిన విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో కోరారు.

రేపు 'మీకోసం'రద్దు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన మీకోసంను రద్దు చేసినట్లు డీఆర్వో చిన్నఓబులేషు ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌మెన్ కమిషన్ రాజీవ్‌రంజిత్‌మిశ్రా జిల్లా పర్యటన ఆది, సోమవారాల్లో ఉన్నందున గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం రాజీవ్‌రంజిత్ మిశ్రా సోమవారం గ్రీవెన్స్ హాలులో ఎస్సీలకు సంబంధించిన సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారన్నారు. అందువల్ల గ్రీవెన్స్‌సెల్ రద్దు చేసినందున దూర ప్రాంతాల నుంచి ప్రజలు ఎవరూ రావద్దని ఆయన కోరారు.

సీసీరోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

ఒంగోలు(రూరల్), జనవరి4(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి చేసిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. అందువల్ల వాటికి సంబంధించిన బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్ రోడ్డులు నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సీఎం కార్యాలయం సమీక్షిస్తున్నారని చెప్పారు. ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో అధికారులు మరింత దృష్టిపెట్టాలన్నారు. పనులు సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ల సహకారం తీసుకుని సమన్వయంతో పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ జి.అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసన మండలి సభ్యుడు దాచూరి రామిరెడ్డి స్మారక మెడికల్‌క్యాంపు ఆదివారం ఒంగోలులోని నెల్లూరు బస్టాండులో గల టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మాదాల వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతంకలిగిన రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200లకు అందిస్తామన్నారు. పలువురు డాక్టర్లు పాల్గొంటారని, వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

ఒంగోలు క్రైం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం ఒంగోలులోని జిల్లా ఆర్మ్డ్ రిజర్వుడ్ కార్యాలయం ఆవరణలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంత నిధులు కేటాయించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఎలాంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్య బలోపేతానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలులోని పీవీఆర్ జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ఉప్పుగుండూరులో ఎమ్మెల్యే బీఎన్ విద్యార్థులతో కలిసి భోజనం

పలుచోట్ల ఉత్సాహంగా కార్యక్రమాలు



ఒంగోలులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ



ఉప్పుగుండూరులో పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే దామచర్ల శనివారం స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల్లో హాజరు శాతం, ఫలితాల మెరుగుదలకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల ఆకలి తీర్చడంతోపాటు, ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, విద్యపై ఆసక్తిని పెంపొందించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోపడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, డీఈవో కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ తారక్‌నాథ్, హెచ్‌ఎం రాధిక, కార్పొరేటర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో ఎమ్మెల్యే బీఎన్..

నాగులుప్పలపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఉప్పుగుండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎమ్మెల్యే బీఎన్ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.మహాలక్ష్మి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఎంఈవోలు రవి, రమణయ్య, నాయకులు గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, పెంట్యాల కోటేశ్వరరావు, కనగాల శ్రీను, తెలగతోటి జాన్సన్, ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ప్రారంభించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటిరెడ్డి, ఎంఈవో ఆంజనేయులు, దాతలు బత్తిన చంద్రశేఖర్, లింగ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మైనంపాడులో..

సంతనూతలపాడు: మైనంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్నభోజన పథకాన్ని ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం నరసింహారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎ.బ్రహ్మయ్య, వైస్‌చైర్మన్ టి.అంజలి పాల్గొన్నారు.

టంగుటూరులో..



భోజనం వడ్డిస్తున్న పోతుల రామారావు

టంగుటూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు ఎంతో ఉపయోగమని మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు చెప్పారు. టంగుటూరులోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన శనివారం మధ్యాహ్నం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకటసుబ్బయ్య, ఎంఈవోలు చెంచుపున్నయ్య, తన్నీరు బాలాజీ, హెచ్‌ఎం తులసీప్రభ, ప్రిన్సిపాల్ బి.సౌజన్య పాల్గొన్నారు.

పొన్నలూరులో...

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పీడబ్ల్యూడీ చెరువు సంఘం అధ్యక్షుడు మండవ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజేంద్రబాబు, ఎంఈవో రవిచంద్ర, హరిబాబు, జడ్పీస్కూల్ హెచ్‌ఎం బి. వెంకటరావు, టీడీపీ నాయకులు పల్లపోతు ప్రసాద్, పల్లపోతు రమేష్, మండవ మురళి, గంధం నరసయ్య పాల్గొన్నారు.

సింగరాయకొండలో...

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో జయమణి, ఎంఈవోలు కత్తి శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

మర్రిపూడిలో...

మర్రిపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్లూరయ్య, ఎంఈవో రంగయ్య, ప్రధానోపాధ్యాయుడు రెబ్బా వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బీఎల్ఎన్ శాస్త్రి, యూటీఎఫ్ నాయకులు కె.శ్రీనివాసులు, అధ్యాపకులు రంగయ్య, కరిముల్లా, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి లోకేష్ కృషి

కొండపి: ఉన్నత విద్యాభివృద్ధికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ వినూత్న కార్యక్రమాలు చేపట్టారని కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పి.మురళి, ఎస్సై ప్రేమ్‌కుమార్, ఎంఈవో రామారావు, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, మురళి, యనమద్ది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండపి హైస్కూలులో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కుట్టుశిక్షణ పొందిన మహిళలకు రామయ్యచౌదరి సర్టిఫికెట్లు అందజేశారు. కోఆర్డినేటర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కొండపి నియోజవర్గ శ్రేణులు



కేక్‌ను తినిపిస్తున్న నాయకులు

ఒంగోలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన వ్యాపారవేత్త, కొండపి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డులోని ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో కొండపి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, ఒంగోలుతో పాటు పరిసర ప్రాంత సన్నిహితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. తొలుత కుటుంబసభ్యులు, ఆత్మీయుల సమక్షంలో పూర్ణచంద్రరావు కేక్‌కటింగ్ చేశారు. విశాఖ జిల్లాలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనలో బిజీగా ఉన్న రాష్ట్ర మంత్రి, పూర్ణచంద్రరావు కుటుంబ ఆత్మీయుడైన డాక్టర్ స్వామి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలు గొర్రెపాటి రామయ్యచౌదరి, ఈదర ప్రభాకరరావు, గాంధీచౌదరి, దగ్గుమాటి కృష్ణారెడ్డి, బత్తుల నారాయణస్వామి, కొమ్మాలపాటి కృష్ణ, ఏలూరి రాంబాబు, మలసాని కోటేశ్వరరావు, నర్సారెడ్డి, కూనంనేని సుబ్బారావు, అనుమోలు సుధాకర్, పోకూరి రవీంద్రబాబు, పోటు పెదబాబు తదితరులు పూర్ణచంద్రరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మండలాల నుంచి తరలివచ్చిన శ్రేణులు

కొండపి : టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు ఒంగోలులోని ఆయన గృహం వద్ద శనివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చాగంరెడ్డి కృష్ణారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, పోటు శ్రీనివాసరావు, గుండపనేని రామ్మూర్తినాయుడు, రాయని నాగేశ్వరరావు, పోకూరి రవీంద్రబాబు, పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, గాలి సందీప్, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నరాల సోమయ్య, చదలవాడ బ్రహ్మేంద్రం, తాటికొండ భీమయ్య, గుండపనేని వెంకటేశ్వరరావు(జీవీ), కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, ఎనిమిరెడ్డి రమేష్ రెడ్డి, అనుమోలు సుధాకర్‌రావు పాల్గొన్నారు. అలాగే సింగరాయకొండ నేతలు కూడా పూర్ణచంద్రరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సైన్స్ ప్రాజెక్ట్

నాగులుప్పలపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ఈదుమూడి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కాకి స్వర్ణలత ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం స్వర్ణలతను హెచ్‌ఎం పోలూరి శంకర రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్దిపాడు సచివాలయం తనిఖీ

మద్దిపాడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సచివాలయాన్ని జడ్పీ సీఈవో బి.చిరంజీవి శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆయన జియో టాగింగ్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తదితర సర్వేల గురించి గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న సర్వే వివరాలు పరిశీలించారు. సర్వే విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

గోమాతకు సీమంతం

కొండపి, జనవరి4 (ఆంధ్రజ్యోతి): కె.ఉప్పలపాడులోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో నెలలు నిండిన గోమాతకు శనివారం అర్చకుడు సోమరాజుపల్లి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తులు, మహిళలు సీమంతం నిర్వహించారు. పూలు, గాజులు, చీరెలు, పసుపు, కుంకుమ, సాత్విక ఆహారం గోవుకు సమర్పించారు. సీమంతం పూర్తయ్యాక 12 గంటలకు ఆవు దూడను ఈనింది.

సాయిబాబా స్కూలులో ముగ్గుల పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో శనివారం 8,9 తరగతుల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ శ్రీసాయినాధుని శృతి మాట్లాడుతూ మన ఇళ్ల ముందు వేసే ముగ్గులు వల్ల చీమలు లాంటి కీటకాలకు ఆహారం దొరుకుతుందన్నారు. సంప్రదాయానికి ప్రతీకలుగా నిలిచే ముగ్గులు వేసే వారికి ఆరోగ్యాన్ని, ఏకాగ్రతను, సృజనాత్మకతను, మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

సంతనూతలపాడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ సూచనలతో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో శనివారం సంతనూతలపాడు ఎస్టీ కాలనీలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో మందాడి వెంకటేశ్వర్లు, ఎన్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్కూలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

మర్రిపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్కూలు అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు భాగస్వామ్యం కావాలని ఎంఈవో రంగయ్య కోరారు. శనివారం మర్రిపూడిలో జరిగిన సమావేశంలో ఆర్.వెంకటేశ్వర్లు, చైర్మన్ సాయిబాబు పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్ర పరికరాల పరిశీలన

కొండపి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇలవర, కట్టావారిపాలేల్లో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు సబ్సిడీపై గడిచిన ప్రభుత్వంలో ఇచ్చిన ట్రాక్టర్, అనుబంధ యంత్ర పరికరాలను ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. తప్పనిసరిగా యంత్ర పరికరాల అద్దె వివరాలను రిజిస్టర్‌లలో నమోదు చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వచ్చిన ఆదాయంలో నుంచి రుణం కట్టుకుంటూ మిగిలిన డబ్బును పొదుపు చేసుకోవాలని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా యంత్ర పరికరాల సేవలు అందేలా గ్రూపు చూడాలన్నారు. కార్యక్రమంలో ఏవో డి.విజయ్‌కుమార్, విస్తరణాధికారి కుమార్, వీఏఏలు శ్రీను, రమ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ ఆధునికీకరణ

నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రణాళికను పరిశీలించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మొదటగా స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌ను విస్తరించనున్నారు. అందులో భాగంగా మ్యాప్‌ను సిద్ధం చేసిన కార్పొరేషన్ అధికారులు, ఆ ప్రాంతంలోని పోలీస్ పెట్రోలు బంక్ వద్ద కూడా కొంత భాగాన్ని విస్తరించాలని నిర్ణయించడంతో ఇందుకు సంబంధించిన విషయాలను నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు వివరించారు. శనివారం స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల క్రీడామైదానంలో జరిగిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల సందర్భంగా ఈ అంశంపై కమిషనర్, ఎస్పీ చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, అలాగే రోడ్‌సైడ్ ఆక్రమణలు పెరిగిపోవడం, కార్పొరేషన్‌కు చెందిన సైడు కాలువలపైనా కట్టడాలు నిర్మించడంతో ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నట్లు తెలిపారు. దీంతో సమస్య పరిష్కారానికి ముందుగా ప్రధాన సెంటర్‌లలో ఆక్రమణలు తొలగించి రోడ్లు విస్తరిస్తామని చెప్పారు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటి పరిష్కారం కోసం తీసుకునే నిర్ణయం అభినందనీయం అని, పోలీసు శాఖ తరుపున సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఒంగోలు(రూరల్), జనవరి4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట జిల్లాపరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను యూటీఎఫ్ సహకారంతో శనివారం హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని అత్యధిక మార్కులు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విస్ విద్యార్థుల సాయం

ఒంగోలు విద్య, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలి జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో క్విస్ ఎన్‌సీసీ విద్యార్థులు సాయంగా ముందుకు వచ్చారు. అంధులను కలెక్టరేట్ బయట నుంచి స్పందన హాలుకు తీసుకొని రావడం, వారికి కావాల్సిన వస్తువులను సమకూర్చడం వంటి సపర్యలు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులను జేసీ గోపాలకృష్ణ అభినందించారు.

సత్తా చాటిన క్విస్ హైస్కూలు విద్యార్థి

హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక క్విస్ హైస్కూలులో ఆరో తరగతి చదువుతున్న సీహెచ్.హరివరన్‌రెడ్డి జూనియన్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. వివిధ దేశాలకు చెందిన 1,750 మందిపోటీల్లో పాల్గొనగా ఫైనల్స్‌కు చేరుకున్న హరిహరన్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శనివారం హరివరన్‌రెడ్డిని క్విస్ విద్యా సంస్థల చైర్మన్ ఎస్.సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ ఎన్.శ్రీరామ్మూర్తి, ప్రిన్సిపాల్ కమలేశ్వరి, కరాటే మాస్టర్ డీఎస్ కుమార్‌లు అభినందించారు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో తీవ్ర జాప్యం

● ఐద్వా రాష్ట్ర నాయకురాలు శ్రీనివాసకుమారి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఐద్వా రాష్ట్ర నాయకురాలు డి.శ్రీనివాసకుమారి విమర్శించారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఐద్వా జిల్లా స్థాయి సమావేశానికి ఊసా రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమారి మాట్లాడుతూ ఒక్క దీపం పథకం మినహా ఏ పథకం అమలు చేస్తున్న పరిస్థితి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జీవీ.కొండారెడ్డి, కంకణాల రమాదేవి, ఎస్కే.నాగూర్‌బీ, జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, బషీర, ఖాదరున్నీషా, జి.భానుమతి, కె.శాంతకుమారి, ఎస్కే.షమీల, మదారమ్మ, పెద్ద గోవిందమ్మ, ఎస్‌డీ.రమిజ, కె.ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అవీ..ఇవీ

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య





మృతిచెందిన సుధీర్, సుధీర్ (ఫైల్)

కంభం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కంభం పట్టణం హీరో షోరూం సమీపంలో చోటుచేసుకొంది. ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం హజరత్ గూడెంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న దేవి కుమారుడు సుధీర్ (25) తన స్నేహితులకు తెలిసిన వారి దగ్గర డబ్బు ఇప్పించాడు. ఆ డబ్బు వారు సక్రమంగా చెల్లించ లేదు. దీంతో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి వచ్చింది. దీనిపై శనివారం తల్లి, కొడుకుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో సుధీర్ మనస్తాపానికి గురయ్యాడు. తల్లి దేవి అంగన్‌వాడికి వెళ్లగా తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించినట్లు తెలిసింది. దేవి భర్త 20 సంవత్సరాల క్రితం విడాకులు తీసుకున్నాడు. ప్రస్తుతం ఆమె ఒంటరిగా ఉంటూనే కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకొంది. చేతికి అందివచ్చిన కుమారుడు ఉరి వేసుకుని మృతిచెందడంతో ఇకత తనకు దిక్కెవరంటూ రోదిస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించకుంటే జరిమానా



హెల్మెట్‌ధారణపై అవగాహన కలిగిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం, జనవరి (ఆంధ్రజ్యోతి): మోటారు సైక్లిస్టులు హెల్మెట్ ధరించకుంటే అపరాధం తప్పదని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు హెచ్చరించారు. పట్టణంలోని పలుచోట్ల శనివారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక సెవెన్‌హిల్స్ లాడ్జీ సమీపంలోని వన్‌వే జంక్షన్ వద్ద తనిఖీలు చేసి ఫైన్‌వేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. దూరప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చేవాళ్లు తప్పక హెల్మెట్ ధరించాల్సిందేనన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఉంటే ప్రాణాపాయం తప్పుతుందని అన్నారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు రవీంద్రారెడ్డి, మౌలాలి తదితరులు ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో వివిధ రకాలైన సేవలు అందించే వారి కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 7901610241, 7901610232, 7901610223 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌గా చిరంజీవి



ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్

మార్కాపురం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిరంజీవి ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసాపత్రాన్ని సబ్ కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయనకు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేయడంలో మెరుగైన ప్రతిభ చూపించిన అధికారికి ప్రతి నెల ఒకరిని ఎంపిక చేయనుననట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగా మొదటిసారి నవంబరు నెలకు, రెండవసారి డిసెంబర్ నెలకు కూడా ప్రజలకు ఉత్తమ సేవ లందించిన అధికారిగా తహసీల్దార్ చిరంజీవికి ఈ ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొనాలి



బహుమతులు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొని విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఒద్దుల వీరారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి ప్రజ్ఞా పరీక్ష విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. 'బాగా చదవండి పరీక్షలకు సిద్ధం కండి' అనే నినాదంతో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ.., జిల్లా వ్యాప్తంగా 5 వేల మంది పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షలలో పాల్గొని తమ విజ్ఞానాన్ని మరింత పెంచుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సాయి, సీఐటీయూ నాయకులు రఫీ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



వాసవి క్లబ్ నూతన కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం వాసవి క్లబ్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.ఆంజనేయప్రసాద్, కార్యదర్శిగా బి.హరి బాబు, కోశాధికారిగా సూరె శ్రీకాంత్ ఎన్నికయ్యారు. వాసవిక్లబ్ ఇంటర్‌నేషనల్ సెక్రటరీ సూరె సురేంద్ర ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వాసవి కమిటీ సభ్యులు విజయవాడలో జరగబోయే హైందవ శంఖారావంకు రూ.15వేల ఆర్థిక సాయాన్ని వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు వీరారావుకు అందజేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని ఆర్యవైశ్య పేద విద్యార్థులు ప్రతిభ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వాసవి ఆర్యవైశ్య పేద విద్యార్థుల సేవాసంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటెక్, బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఏజీబీఎస్సీ, ఎంబీబీఎస్, సీఏ, బిఫార్మసీ, ఎంఫార్మసీ, పిజి కోర్సులు చదువుతున్న ఆర్యవైశ్య పేద విద్యార్థులు 65శాతం కంటే ఎక్కువ మార్కులు పొందిన వారు ఈనెల 8 నుంచి దరఖాస్తులు తీసుకుని ఈ నెల 20వ తేదీలోగా గిద్దలూరులోని అమ్మవారిశాలలోని తమ కార్యాలయంలో అందచేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో
మధ్యాహ్న భోజనం ప్రారంభం

● వై.పాలెంలో ప్రారంభించిన టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ● ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి దోహదం



వై.పాలెంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంచి చేసే ప్రభుత్వమని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో 'డొక్క సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' కార్యక్రమం ప్రారంభించారు. సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపి వేసి విద్యార్థులతో ఆకలి కేకలు పెట్టించారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల కాలంలో ఇంటర్ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం వలన విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కూడ ఉపయోగపడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు అన్ని చెల్లించినట్లు గుర్తు చేశారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించాలన్నారు. కాళాశాల ప్రాంగణం అభివృద్ధి కోసం రూ.7లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. త్వరలో పనులు చేపడతారన్నారు. ముందుగా లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి వారితో కలసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనానికి అవసరమైన గ్లాసులు, ప్లేట్లు దాతలు గోళ్ల వీర వెంకట సుబ్బారావు, ఒంగోలు ఆదిరెడ్డి, కందుల నారాయణరెడ్డిలు అందించారు. వారిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి అంజనేయులు, మల్లునాయక్, టీడీపీ మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు తోట మహేష్ నాయుడు, కంచర్ల సత్యనారాయణ గౌడ్, వెంగళ రెడ్డి, కాళాశాల ఉద్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు, టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ కేవీ.వెంకటరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు ప్రభుత్వ మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యతని స్తుందన్నారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సహకారాలతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గొట్టం రామనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కంభం : ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్‌పిటిసి కొత్తపల్లి జ్యోతి, తురిమెళ్లలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, డ్రాప్‌అవుట్ల సంఖ్య తగ్గించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. ఈ పౌష్టికాహారం విద్యార్థుల ఆరోగ్యాన్ని పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ విజయవాడ పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన లైవ్ ప్రోగ్రామ్‌ను తిలకించారు. కార్యక్రమంలో కంభం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తిరుమలయ్య, ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు, సర్పంచులు మాదా సుభద్ర, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, కేతం శ్రీనివాసులు, పలువురు టీడీపీ నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న పథకాన్ని శనివారం ఎంఈవో శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. భోజనం ఏర్పాటులో ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలు పాటిం చాలన్నారు. ఏమైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మీ, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కరీమూన్‌బీబీ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తదితర ఉపాధ్యాయులు, టీడీపి నాయకులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని మండల అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజన పథకం విద్యార్థులకు ఎంతగానో ఉయోగపడుతుందన్నారు. డ్రాపవుట్స్ తగ్గుతాయన్నారు. హాజరుశాతాన్ని పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, ఎంఈవోలు మల్లిఖార్జుననాయక్, రాజశేఖరరెడ్డి, ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు : మన ప్రాంత అభివృద్ధికి అందరం కలసికట్టుగా పనిచేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ మన ప్రాంత అభివృద్ధికి మన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యాక్రమాలకు చేయుతనిద్దామన్నారు. ప్రభుత్వ కళాశాలలోని పాడుబడిన భవనాల స్థానంతో కొత్తగా భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. వంటలను మాదిరిగా శుచిగా, రుచిగా తయారుచేసి విద్యార్థులకు వడ్డించాలని కుకుంగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు బేగంను కోరారు. మాజీ ఎంపీపీ నాదేళ్ల పెద్దసుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సారి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బోర్రా వెంకటరత్నం, ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అశ్వనీకుమార్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పేద విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం వరమని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు క్రమం తప్పకుండా విద్యను అభ్యసించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఇప్పటికే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కొండలరావు, ప్రిన్సిపాల్ మహాలక్ష్మమ్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ నారాయణరెడ్డి, కళాశాల అధ్యాపక సిబ్బంది, టీడీపీ సీనియర్ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, ఆర్.సుబ్బరత్నం, షేక్.రఫీ, కొప్పుల సుబ్బారెడ్డి, టి.చెన్నారెడ్డి, షేక్ మౌలాలి, కే.దానం, తుమ్మల్ తదితరులు పాల్గొన్నారు.







కొమరోలులో భోజనం ప్లేటు అందుకుంటున్న విద్యార్థులు కంభంలో భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, పొదిలిలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరెడ్డి

ల్యాండ్ గ్రాబింగ్‌యాక్ట్ ద్వారా పేదల భూములకు రక్ష



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్

మార్కాపురం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి). ల్యాండ్‌గ్రాంబింగ్ చట్టం ద్వారా భూ ఆక్రమణ దారులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ త్రివినాగ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును అధికారులతో కలిసి నిర్వహించారు. సబ్‌కలెక్టర్ త్రివినాగ్ హాజరై ప్రజలనుండి వచ్చిన వినతులను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి సకాలంలో ఆ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ గత డిసెంబర్ నెల అరవ తేదీ నుంచి మండలంలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో భూ ఆక్రమణలపై అధికంగా ప్రజలనుండి వినతులు అందినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీదారునికి రెవెన్యూ కోర్టును నిర్వహించి అర్హులైన వారికి న్యాయం చేస్తావన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణ, సర్వేయర్ సంజీవయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



తర్లుపాడులో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

తర్లుపాడు : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం అని తహసీల్దార్ విజయ్ భాస్కర్ తెలిపారు. మండలంలోని గానుగ పెంటలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళితులు పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న భూములను సోషయల్ ఫారెస్ట్ అధికారులు తమ భూములు ఫారెస్ట్ కు చెందిన భూములంటూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అర్జీ ఇచ్చారు. సర్వే నెంబర్ 177, 167, 189లో 90 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నట్లు అర్జీలో పేర్కొన్నారు. పొలాలకు వెళ్లే రహదారికి గజ్జలకొండకు చెందిన ఒక వ్యక్తి కంచె వేయడంతో తమ భూములు బీడు భూములుగా మారాయని కొందరు రైతులు అర్జీలు ఇచ్చారు. పలు సమస్యలపై 22 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. వచ్చిన అర్జీలకు 45 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, దేవదాయ శాఖ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

● లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. బ్రెయిలీలిపి ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలలో ఉన్నారన్నారు. 15 మంది అంధ విద్యార్థులకు దుప్పట్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి, హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, గుమ్మా రాజయ్య, ప్రత్యేక ఉపాధ్యాయులు సాదిక్, చెన్నకేశవులు, సురేష్, సిఆర్‌పీలు కోటేశ్వర రావు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో విద్యార్థులకు నగదు జమ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న 67 మంది దివ్యాంగ విద్యార్థుకు సమగ్రశిక్ష ద్వారా మంజురైన రవాణా నగదును టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు చెక్కులను అందజేశారు. స్థానిక జూనియర్ కాళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిత శిక్షణ సిబ్బంది ఎంఈఓలు ఈ చెక్కులను వారి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆంజనేయులు, మల్లునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలి

ఒంగోలు(రూరల్), జనవరి4(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి చేసిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. అందువల్ల వాటికి సంబంధించిన బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

అధికారుల చొరవతో రహదారి నిర్మాణ పనులు

● వారం రోజులుగా అడ్డుకున్న వైసీపీ నేతలు



పోతలపాడులో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

తర్లుపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతలపాడులో మస్జీద్ వద్ద వేస్తున్న రోడ్డును గత వారం రోజులుగా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. తమ సొంత భూమిలో రోడ్డు వేస్తున్నారని రావులపల్లె వెంకటేశ్వర్లు, రమణయ్య, కాశమ్మలు వారంరోజుల నుంచి రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో పోతలపాడు గ్రామంలో వైసీపీ నాయకులకు, టీడీపీ నాయకులకు వివాదం నెలకొంది. దీంతో తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఎస్ఐ బ్రహ్మనాయుడులు రోడ్డును పరిశీలించారు. రావులుపల్లె వెంకటేశ్వర్లు, వారి అనుచరులకు ఉన్న పట్టాలను తీసుకురావాలని ఆదేశించారు. గతంలో తీసుకున్న దొంగ పట్టాలను చూపించడంతో అప్పటికప్పుడు తహసీల్దార్ వెంటనే ఆ పట్టాలను రద్దు చేసి ఈ రోడ్డు భూమి గ్రామకంతానికి చెందినదని పట్టాలను రద్దు చేశారు. రోడ్డును వెంటనే వేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఎస్ఐ పర్యవేక్షణలో రోడ్డులో ఉన్న అడ్డంకులను జేసీబీతో తొలగించారు. అధికారుల చొరవతో వివాదానికి తెరపడింది.

పన్నులు, వాహనబీమా చెల్లించని స్కూల్ బస్ సీజ్



సీజ్ చేసిన పాఠశాల బస్సు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సును మార్కాపురం ఆర్‌టీవో మాధవరావు సీజ్ చేశారు. శనివారం సాధారణ తనిఖీ లలో భాగంగా ఎర్రగొండ పాలెం పుల్లలచెరువు రోడ్డులో తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆటుగా వస్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో బస్సుకు ట్యాక్స్‌లు, ఇన్సురెన్సు లైసెన్సు లేక పోవడంతో బస్సును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన బస్సును స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనానికి లైసెన్సు, రోడ్డుట్యాక్స్, ఇన్సురెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. కావున ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ఆర్‌టీవో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పలు వాహనాలను తనిఖీ చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

దొనకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బూచేపల్లి ట్రస్టు సహకారంతో ఏర్పాటుచేసిన స్టడీ మెటీరియల్‌ను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ పేద విద్యార్థులకు, పేదలకు బూచేపల్లి ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, షేక్ అమీర్, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, వైసీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు బాల్యం

పామూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదువు కొంటేనే బంగారు బాల్యం సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని ఇనిమెర్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం బంగారు బాల్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, అక్రమ రవాణ నివారణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. డ్రాప్‌అవుట్ అయితే వారి భవిషత్ అంధకారమవుతుందన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సహాయ సహకారాలు

తాళ్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యున్నతికి బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూత నిస్తున్నదని జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు జడ్పీహైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా శనివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మా అమ్మ సొంతగ్రామమైన బొద్దికూరపాడు గ్రామస్థుల అభిమానం, చూపుతున్న ఆదరణ మరువలేనిదని అన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సురేష్, సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, పులిరామిరెడ్డి, రిటైర్ట్ హెచ్‌ఎం అంజిరెడ్డి, సంగన యోగిరెడ్డి, బి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో భూముల పరిరక్షణ

పామూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దేవస్థానాలకు సంబంధించిన భూములు ఆక్రమణలకు గురి కాకుండా డ్రోన్ కెమెరాలతో పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో శ్రీగిరిరాజు నరసింహ బాబు తెలిపారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డులోగల సర్వేనెంబర్ 329/2లో గల మదన వేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన భూముల్లో ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ ద్వారా శనివారం తొలగించారు. దేవస్థాన భూములను ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, విజయ్‌కుమార్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

పీసీపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పీసీపల్లిలో ఈనెల 13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. పోటీలో పాల్గొనే జట్లు ఎంట్రీ ఫీజు చెల్లించి 12వతేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలు, మూడవ బహుమతిగా రూ.7 వేలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 9618636844 నెంబరును సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలు సేవిస్తే ప్రాణాలకే ముప్పు

పీసీపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు సేవిస్తే ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవడమేనని ఎస్సై జి.కోటయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్‌నేరాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. గుర్తుతెలియని మొబైల్‌నెంబర్ల నుండి వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దన్నారు. పొరపాటున ఆ ఫైల్స్ ఓపెన్ చేస్తే మన ఫోన్‌లో ఉన్న సమాచారం మొత్తం సైబర్ నేరస్థుల చేతుల్లోకి వెళుతుందన్నారు. తద్వార మన బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును కొల్లగొడతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయశంకర్, ఎంఈవో ఆర్.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

దర్శి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధులు విద్యావంతులుగా మారే అదృష్టాన్ని కల్పించిన చిరస్మరణీయుడు లూయిస్‌బ్రెయిలీ జయంతి వేడుకలను దర్శిలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భవితా కేంద్రంలో ఆయన చిత్రపటానికి ఎంపీడీవో కృష్ణమూర్తి, సంఘసేవకుడు జీవీ రత్నం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంధుల మునివేళ్లల్లో లూయిస్‌బ్రెయిలీ సజీవంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జి.ప్రేమ్‌కుమార్, దేవతి ప్రసాద్, కె.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆరోగ్యకర జీవితం

» ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

» కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకరమైన జీవితం అందించటమే ప్రభుత్వం లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియ అన్నారు. జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగటానికి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ అత్యంత కీలకమని చెప్పారు. ప్రతి విద్యార్థిలో



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

స్వయం ప్రతిభ ఉంటుందన్నారు. దానిని మెరుగు పరుచుకుని పట్టుదలగా ముందుకు సాగుతూ రాణించాలన్నారు. తాను ఎదుగుతూ మరికొంత మందికి ఉపాధి కల్పించే దిశగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రయివేటు కళాశాలలకు దీటుగా కనిగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తున్న వారిని గుర్తించి తమ దృష్టికి తీసుకువచ్చిన వారికి రూ.లక్ష రివార్డుగా అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర మొక్కలు నాటారు.

కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, సీఐ ఖాజావలి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భూసమస్యల శాశ్వత పరిష్కారానికే సదస్సులు

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం మండల పరిధిలోని పునుగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఈనెల 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన సదస్సుల్లో 14వేల వరకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ అర్జీలకు 45 రోజులలోపు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామంలో జాయింట్ ఎల్‌పీఎం, వీస్తీర్ణంలో లోపాలు ఉన్నట్లు అర్జీలు వచ్చినట్టు చెప్పారు. నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పునుగోడులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ సమస్యలు సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేసేలా దృష్టి సారించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు కలెక్టర్ అన్సారియా సీమంతం చేశారు.

తొలుత గార్లపేట రోడ్డులోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యేతో కలసి సందర్శించారు. ఆసుపత్రిలోని కంగారు కేర్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

రామదండు కదిలింది..

కురిచేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామదండు మహాభక్త సమూహం శనివారం సాయంత్రం కురిచేడు నుంచి మండలంలోని నమశ్శివాయపురం గ్రామానికి తరలి వెళ్లింది. రామేశ్వరం నుంచి శ్రీరాముని పీఠంతో గ్రామగ్రామాన తిరుగుతూ శ్రీరాముని చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతిగ్రామంలో గ్రామస్థులంతా కలసి తమ గ్రామానికి ఆహ్వానించి రామాలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి పక్క గ్రామానికి అందజేసి వస్తున్నారు. ఈక్రమంలో కురిచేడు మండలంలోని పేరుబొట్లపాలెం గ్రామానికి మొదట రామదండు రాగా అక్కడ నుంచి కాటంవారిపల్లెకు, అక్కడ నుంచి గొల్లపాలెంకు రామదండు వచ్చింది. గొల్లపాలెం నుంచి శుక్రవారం రాత్రి కురిచేడు కోదండరామాలయానికి భక్తుల కోలాహలంతో శ్రీరామనామ జపంతో తీసుకువచ్చారు.

శనివారం కురిచేడు నుంచి నమశ్శివాయపురం గ్రామానికి తరలించారు. నమశ్శివాయపురం గ్రామ పొలిమేరలో ఆ గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆహ్వానం పలికారు. కురిచేడు భక్తులు వారికి శ్రీరాముని పీఠం అందజేసి తిరిగివచ్చారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండరామాలయ కమిటీ, గ్రామ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీరాముని చిత్రపటంతో జరిగిన గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

విద్యారంగానికి పెద్దపీట

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. పరిపాలనాదక్షుడైన సీఎం చంద్రబాబు, దృఢసంకల్పం కల్గిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజకపాలన అందిస్తుందన్నారు. ఉన్నత విద్యావంతుడైన విద్యాశాఖ మంత్రి లోకేష్ సారథ్యంలో విద్యారంగం ఎంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేయటంతో అధ్వానంగా మారిందని డాక్టర్ లక్ష్మి విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గాడిలో పెట్టి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు, ఎంఈవో రమాదేవి, హైస్కూల్ హెచ్‌ఎం షేక్ ఖలీషా, దర్శి నగర పంచాయతీ వైస్ చైర్మన్ జి.స్టీవిన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

మోడల్‌స్కూల్ విద్యార్థినులకు పరుపుల పంపిణీ

స్థానిక మోడల్‌స్కూల్ విద్యార్థినులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సొంత నిధులతో సమకూర్చిన వంద పరుపులు, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలన్నారు. సొంత నిధులతో వంద పరుపులు అందించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, విద్యా కమిటీ చైర్మన్ అనూష, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంతో ఇంటర్ విద్యార్థులకు ఊరట

పామూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అభ్యసిస్తున్న ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం హర్షణీయమని సీఐ ఎం. భీమానాయక్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు ప్రారంభించారు. భీమానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రామాస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండలంలోని శీలంవారిపల్లి హైస్కూల్ ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో రాజాల కొండారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శీలంవారిపల్లిలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం ఎన్.తిరుపతయ్య, అధ్యాపకుడు ఎన్.వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు తెలపకుండా సదస్సులా..!

» తహసీల్దార్‌పై ఎంపీపీ అసహనం

తాళ్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ సదస్సులు నిర్వహించడంపట్ల తహసీల్దార్ సంజీవరావుపై ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. శనివారం మాధవరం సచివాలయం వద్ద జరిగిన సదస్సు తీరుపట్ల ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదస్సుకు పది మంది కూడా రాకపోవటం పట్ల ఆవేదన చెందిన ఎంపీపీ తాటికొండ మాట్లాడుతూ గ్రామంలో దండోరా కూడా వేయించకపోవటం, ప్రజా ప్రతినిధులుగా తమకు కనీసం సమాచారం ఇవ్వలేదంటే అధికారులు ఎంత బాధ్యతారాహిత్యంగా పనిచేస్తున్నారో అర్థమవుతుందన్నారు. సమాచారం లేక సమస్యలు ఉన్న రైతులు సదస్సుకు రానందున రెవెన్యూ సదస్సు నిర్వహించవద్దని తహసీల్దార్‌కు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పుల వల్ల ఇబ్బందులు పడుతున్న రైతాంగం తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. తమ గ్రామ రైతులు తన వద్దకు రాగా విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజాప్రతినిధిగా అనేకసార్లు ఫోన్లు చేసినా స్పందనలే దన్నారు. కనీసం తన ఫోన్ కూడా ఎత్తలేదంటే సామాన్యులకు ఎలా సర్వీస్ చేస్తున్నారో అర్థమవుతుందని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామానికి చెందిన నన్నయ్య రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు తాను ఇబ్బంది పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మార్లు అధికారుల వద్దకు వెళ్లినా కాలాయాపన చేస్తున్నారని అన్నారు. సమస్య పరిష్కరించకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ అధికారుల వద్ద వాపోయాడు. సభ నిర్వహించవద్దని ఎంపీపీ చెబుతుండగా మండల సర్వేయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు బాధ్యత తీసుకుంటాని హామీ ఇవ్వటంతో సదస్సును సజావుగా నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో ఏడు అర్జీలు వచ్చాయి.

కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, సర్పంచ్ టి.రేణుక, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌పై అసహనం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ తాటికొండ

దర్శి అభివృద్ధికి అధిక నిధులు విడుదల చేయాలి

దర్శి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దర్శి అభివృద్ధికి అధిక నిధులు విడుదల చేయాలని శనివారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య విజ్ఞప్తి చేశారు. అమరావతిలో శనివారం చైర్మన్ పిచ్చయ్య మంత్రి నారాయణ, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు విడుదల చేయించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

నగర పంచాయతీని అప్‌గ్రేడ్ చేసి పోస్టులు మంజూరు చేయాలని కోరగా వీలైనంత త్వరగా పోస్టులు మంజూరు చేస్తానని మంత్రి భరోసా ఇచ్చినట్లు పిచ్చయ్య తెలిపారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారం

ముండ్లమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని చింతలపూడి, కొమ్మవరం గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. భూసమస్యలపై అర్జీలు ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి, మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వోలు బి.గురవయ్య, కావూరి దయానందం, రాఘవరెడ్డి, సుజాత, అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

పామూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. శనివారం మండలంలోని కరోళ్లపాడులో జరిగిన సదస్సులు పలువురు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, నీరుకట్టు హరిబాబు, ఉప్పలపాటి హరిబాబు, కేవీ రమణయ్య, నీరుకట్టు శ్రీనివాసులు, బట్టరుశెట్టి ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం కోవిలంపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మంజునాథరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు పాములపాటి మాధవప్రసాద్, షేక్ రజ్జబ్‌బాషా, ఆర్‌కే వలి, పాములపాటి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి దర్శిలో మెగా క్రికెట్ టోర్నమెంట్

దర్శి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గొట్టిపాటి-నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 7 నుంచి జరుగుతుందని నిర్వాహకులు అంజినాయుడు, ఇత్తడి దినకర్ తెలిపారు. ఈ పోటీలు ఈనెల 12 వరకు జరుగుతాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 6లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ప్రథమ బహుమతి రూ.1,15,116, ద్వితీయ బహుమతి దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య రూ.65 వేలు, తృతీయ బహుమతి టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు రూ.45 వేలు, నాల్గవ బహుమతి టీడీపీ నాయకుడు ఎం.యలమందారెడ్డి రూ.25 వేలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దొనకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకం ఏర్పాటుతో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎంఈవో సాంబశివరావు పేర్కొన్నారు. దొనకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం కల్పించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ధనుముని, ఎంఈవో-2 షేక్ అమీర్, హెచ్‌ఎం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం 'మధ్యాహ్న భోజనం'

తాళ్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వరమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఊటుకూరు కోటయ్య జూనియర్ కళాశాలలో శనివారం ఈ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశానుసారం తన వంతుగా కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు రూ.ఐదు వేలు సాయం చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వహణకు పూర్వ విద్యార్థులు కోట శ్రీనివాసరెడ్డి, చందోలు శివరామకృష్ణ, చందోలు రవికుమార్, మారం రామకోటిరెడ్డి, తదితరులు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, కళాశాల దాత ఊటుకూరి రామకోటేశ్వరరావు, ఎంపీడీవో కె.సుందరరామయ్య, సర్పంచ్‌లు చార్లెస్ సర్జన్, కాలేషావలి, ఐ.శ్రీనివాసరెడ్డి, తూము శివనాగిరెడ్డి, ఎంఈవోలు జి.సుబ్బయ్య, సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మినుము, ఇతర పంటలను కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జరిగిన సీఎస్‌పురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. చెన్నపునాయినిపల్లి, వెంకటాయచెరువు, గుంతచెన్నంపల్లి, గ్రామాల్లో వాటర్‌ప్లాంట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎంపీవో ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు పథకం కింద మంజూరైన 27 పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయన్నారు. బోయమడుగుల పంచాయతిలో త్రీఫేస్ కరెంటు ఇవ్వాలని సర్పంచ్ బిట్ల చిరంజీవి కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు మాటాడుతూ స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి మండలానికి రూ.కోటి వరకు ప్రతిపాదనలు పంపించేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, పశువైద్యాధికారి షేక్ మునీర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి టీడీపీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము. తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్) రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకుసంబంధించిన చెక్కును శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా ఎస్టీఆర్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీకటి వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

1

ఆదివారం 5 జనవరి 2025



చదవడం.. రాయడం.. నేర్చుకోవాలి

● స్వయం సహాయక మహిళలకు కలెక్టర్ సూచన



అక్షర వెలుగువాచకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలు చదవడం, రాయడం నేర్చుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వయోజన విద్యాశాఖ ఎస్ ఈ, ఆర్పీలు చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన అక్షర వెలుగు వాచకాలను శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతను అందజేసి మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలన్నారు. స్వయం సహాయక బృందాల్లోని నిరక్షరాస్య మహిళలు నిత్యం తరగతులకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మధుసూదనరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మ, పర్యవేక్షకులు కొణదల మనోరంజన్, ప్రసాద్, వెంకటస్వామి, హెచ్‌డీ యాంకర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కనున్న షీ-ఆటోలు

- పీఎం అజయ్‌తో మహిళలకు ఉపాధి
- పది మండలాల నుంచి 28 మంది ఎంపిక
- ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధిపై డీఆర్‌డీఏ దృష్టి
- గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా కార్యక్రమం
- రూ.3 లక్షలు వడ్డీలేని రుణం.. రూ.50 వేలు సబ్సిడీ

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా.. ఆర్థికంగా శక్తివంతులను చేయడమే ధ్యేయంగా.. జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రవాణా రంగంలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు నూతన ప్రణాళికల అమలుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి ఇచ్చేందుకు డీఆర్‌డీఏ షీ-ఆటోలను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో ప్రయోగాత్మకంగా గుంటూరు జిల్లాలో షీ-ఆటోలను ప్రవేశపెట్టేందుకు డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం అనుకున్న లక్ష్యాలను సాధిస్తే మిగిలిన జిల్లాల్లో కూడా షీ-ఆటోలను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు డీఆర్‌డీఏ తరఫున బ్యాంకులతో మాట్లాడి రుణాలు మంజూరు చేయిస్తారు. ఒక్కొక్క మహిళకు రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తారు. అందులో రూ.50 వేల వరకు సబ్సిడీ కింద మినహాయింపు ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు నెలవారీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద సుమారు 82 మంది మహిళలకు ఆటోలు ఇప్పించేందుకు డీఆర్‌డీఏ ఏర్పాట్లు చేసింది. ఇందులో మొదట విడతగా 28 మంది మహిళలను ఎంపిక చేశారు. అందులో పది మండలాలకు ప్రాధాన్యం ఇచ్చారు. చేబ్రోలు-3, దుగ్గిరాల-2, గుంటూరు-7, కొల్లిపర-1, మేడికొండూరు-2, పెదనందిపాడు-6, ఫిరంగిపురం-2, తెనాలి-1, తుళ్లూరు-1, వట్టిచెరుకూరు-3 చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు.

డ్రైవింగ్ నైపుణ్యం కలిగిన వారే ఎంపిక..

గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన షీ-ఆటో లబ్ధిదారుల ఎంపికలో డీఆర్‌డీఏ అధికారులు ప్రధానంగా చదువుతో పాటు డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఆటో తీసుకుని పూర్తిగా దానిపై ఆధారపడి ఆర్థికాభివృద్ధి సాధిస్తామన్న భరోసా, నమ్మకం కలిగిన వారిని మాత్రమే మొదటి విడతలో ప్రాధాన్యం ఇచ్చారు. లబ్ధిదారులు ఎంచుకున్న రవాణా రంగం వారికెంత మేరకు ప్రయోజనకరంగా ఉంటుందన్న విషయాన్ని కూడా ఆయా గ్రామాలకు వెళ్లిన డీఆర్‌డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఆటోలకు స్థానికంగా ఉన్న అవసరాలను కూడా అంచనా వేశారు.

స్థితిగతుల్లో మార్పు...



మహిళలు తలుచుకుంటే చేయలేని పనిలేదు. రవాణా రంగంలో వారి ప్రాధాన్యం పెంచడం సంతోషం. పీఎం అజయ్ కార్యక్రమం ద్వారా ఇప్పించే ఆటోలు వారి జీవన స్థితిగతులను సంపూర్ణంగా మార్చుతాయి. వారి ఆర్థికాభివృద్ధి ఆటోలా పరుగులు పెడుతుంది. మూస పోసిన పద్ధతిలో కాకుండా వినూత్నంగా ఆలోచించే ఎస్సీ మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తరఫున అన్ని విధాలా అండగా ఉంటాం.

-టీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ, గుంటూరు

టైపింగ్‌లో హరితకు ప్రథమ ర్యాంకు



ఆరాధ్యుల హరితసాయి

వేమూరు, మంగళగిరి జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన ఆరాధ్యుల హరితసాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు 2024లో నిర్వహించిన తెలుగు టైప్ లోయర్ గ్రేడ్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును సాధించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో తమ బంధువుల వద్ద ఉండి మంగళగిరిలోని మాధవి టైపు ఇనిస్టిట్యూట్ ద్వారా తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షకు హాజరైంది. 200 మార్కులకు గానూ 196 మార్కులను సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హరితసాయికి మాధవి టైప్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు పి.మురళీధర్, సహచర విద్యార్థులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు అభినందనలు తెలిపారు.

- రూ.70 కోట్ల మంజూరులో అవకతవకలు
- నకిలీ పాసు పుస్తకాలతో దారిమళ్లించినట్లు ఆరోపణ
- బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి ప్లెడ్జి రుణాలు
- నల్లపాడు జీడీసీసీ బ్యాంకు అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- 17 కోల్డ్‌స్టోరేజ్‌లకు జారీ చేసిన లోన్లను పరిశీలించాలని ఆదేశాలు



రుణాలు గోల్‌మాల్

గుంటూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అనే వ్యక్తి పేరుతో గుంటూరు సమీపంలోని నల్లపాడు జీడీసీసీ బ్రాంచ్‌లో రూ.10 లక్షలు రుణం ఇచ్చినట్లు రికార్డులో ఉంది. ఆ రుణం సంగతి తనకు తెలియదని బాధితుడు చెప్తున్నాడు. దీంతో నల్లపాడు బ్రాంచ్‌లో 2022-23 మధ్య కాలంలో జరిగిన అక్రమ రుణ మేళా వెలుగు చూసింది. ఒకే కోల్డ్ స్టోరేజ్‌కి సుమారు రూ.53 కోట్ల వరకు రుణాలు ఇవ్వడం, అక్కడ సరైన మిర్చి నిల్వలు లేకపోవడం వంటి వాటిని అప్పట్లో విచారణకు వెళ్లిన అధికారులు గుర్తించారు. ఈ మేరకు నల్లపాడు జీడీసీసీ అక్రమాలపై ప్రాథమిక విచారణ నిర్వహించిన జిల్లా సహకార అధికారి వీరాచారి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో మరింత లోతైన విచారణ జరిపించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సహకార కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో తెనాలి డివిజనల్ సహకార అధికారి కేవీ రామారావును విచారణ అధికారిగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రారంభమైన విచారణ..

ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో నల్లపాడు జీడీసీసీ(గుంటూరు జిల్లా కేంద్ర సహకార) బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. బ్యాంకుకు సంబంధించిన సమాచారం, విచారణకు అవసరమైన రికార్డులను సహకార శాఖ అధికారులు కేవీ రామా రావుకు అందజేశారు. బ్యాంకు పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు మంజూరు చేసిన రుణాలు భారీ స్థాయిలో పక్కదారి పట్టిన నేపథ్యంలో ఈ విచారణ జరుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో జీడీసీసీలో కీలకపాత్ర పోషించిన వ్యక్తులు నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి రుణాలను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు పరిధిలో సుమారు రూ.70 కోట్ల వరకు ప్లెడ్జి రుణాల కింద మంజూరు కాగా చాలా వరకు బినామీల ద్వారా వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలున్నాయి. వినుకొండ ప్రాంతంలో క్యాటరింగ్ చేసుకునే వ్యక్తులకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు అక్రమార్కులైన నేతలకు సహాయ పడ్డారన్న విమర్శలున్నాయి.

అన్నింటిపై విచారణ..

నల్లపాడు బ్రాంచి పరిధిలోని 17 కోల్డ్ స్టోరేజ్‌లకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. వాటిపై కూడా విచారణ జరగనుంది. ప్లెడ్జి రుణాలతో పాటు, మిగిలిన రుణాలపై కూడా దర్యాప్తు చేపట్టనున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో జరిగిన మొత్తం లావాదేవీలు, రుణాలు పంపిణీ, రికవరీ తదితరాలపై విచారణ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది.

అన్ని చోట్ల అదే పరిస్థితి

కోల్డ్‌స్టోరేజ్‌ల పేరుతో జీడీసీసీలో భారీగా ప్లెడ్జి రుణాలు పొందారు. వాస్తవానికి అక్కడ ఏ విధమైన మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు ఇచ్చేశారు. కొన్ని సందర్భాల్లో రుణం ఇచ్చేటప్పుడు మిర్చి ఉన్నట్లుగా చూపించినా ఆ తర్వాత దానిని వేరే వ్యక్తులకు అమ్మేశారు. ఇటువంటి వ్యవహారంలో కొందరు అధికారులు పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. చాలా సందర్భాల్లో అసలు రైతుకు తెలియకుండానే రుణం ఇచ్చేశారని సమాచారం. ఇలా అక్రమాలు పెద్దఎత్తున జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. ఇవికాక ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రుణాల పేరుతో బ్యాంకు నిధులను దారిమళ్లించారని తెలిసింది. ఇతర రుణాల్లోనూ అక్రమాలు జరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రభావతిపై.. ఎవరి ప్రభావం?

- రఘురామ కేసులో వెలుగుచూసిన కొత్త కోణం
- ఐఏఎస్ శ్రీలక్ష్మి తరహాలో ఊబిలో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్
- గత ప్రభుత్వంలో ఓ ఎంపీ అండతోనే ఆమెకు కీలక పోస్టింగ్
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ఆ ఎంపీని వెంటాడుతున్న గతం

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుని హత్య చేసేందుకు పన్నిన కుట్ర కేసులో నిందితురాలిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ప్రభావతి ఉదంతంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ప్రభావతి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమి తురాలు కావడంలో కీలకపాత్ర పోషించిన నాటి వైసీపీ ఎంపీ, ఇప్పటి కూటమి ఎంపీపై కొత్త చర్చకు తెరలేచింది. రఘురామకృష్ణరాజును హింసించాలన్న ఆలోచన నాటి ము ఖ్యమంత్రి జగన్‌ది కాగా అందుకు ఆయన చుట్టూ ఉన్న నేతలు సహాయ పడ్డారన్న ఆరోపణలున్నాయి. జీజీహెచ్ సూ పరింటెండెంట్‌గా ఉన్న ప్రభావతిని కూడా అప్పట్లో కీలకంగా ఉన్న ఎంపీ ప్రభావితం చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రభావతి భర్త రవికి సదరు ఎంపీకి మధ్య మంచి స్నేహం ఉండడంతో తగిన అర్హతలు లేనప్పటికీ ఆమెను జీజీహెచ్‌లో అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. ఆమెను సూపరింటెండెంట్‌ను చేసేందుకు అర్హతలు ఉన్న నిపుణులైన డాక్టర్లను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఈ కృతజ్ఞతతోనే ప్రభావతి, రఘురామకృష్ణరాజు కేసులో తీవ్రమైన అన్యాయా నికి ఒడిగట్టినట్లు ప్రచారం జరుగుతోంది. 2020లో ఆమె జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించి 2023లో ఉద్యోగ విరమణ పొందారు. ఆ మధ్య కాలంలోనే రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ ఉదంతం జరిగింది.

ఎంపీ అండతో చెలరేగిన వైనం..

జగన్‌కు అప్పట్లో సన్నిహితంగా ఉండే ఎంపీ అండ దం డలు ఉన్నాయన్న ఆలోచనతో ప్రభావతి చాలా సంద ర్భాల్లో ఇతర పార్టీల నేతలను పూచికపుల్లతో సమానంగా చూశారన్న ఆరోపణలున్నాయి. రఘురామ దేహంపై తీవ్రమైన గాయాలు ఉన్నా ఏమి కాలేదని నివేదిక ఇచ్చినట్లు సమాచా రం. ఆమె మాత్రమే కాకుండా గుండె వైద్య నిపుణులపై కూ డా నివేదిక మార్చేలా ఒత్తిడి తెచ్చినట్లు తేలింది. చెప్పినట్లు చేయకపోతే బాగుండదు.. ప్రభుత్వ పెద్దల నుంచి ఇబ్బందులు వస్తాయని ప్రభావతి తోటి వైద్యులతో అన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇదే వ్యవహారంలో రఘురామకృష్ణరాజు లాయర్ పోసాని వెంకటేశ్వర్లు చేసిన వాదనలు కూడా వారు గుర్తు చేస్తున్నారు. సీఐడీ కస్టడీలో ఉన్న రఘురామ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య నివేదిక ఇవ్వాలని కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ప్రభావతి ఒత్తిడి తీసుకురావడంలో ఎంపీ పాత్రే కీలకమైనదనే వాదన తెరపైకి తెచ్చారు.

మరో శ్రీలక్ష్మి..

రాజకీయ నాయకుల అండదండలతో కీలకమైన పోస్టు లోకి వస్తున్న అధికారులు ఎక్కడో ఒక చోట ఇరుక్కుంటూనే ఉన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి అదే రీతిలో కేసుల్లో ఇరుక్కోగా ఇప్పుడు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తప్పులో కాలేశారు. ఉద్యోగ విరమణ పొంది ప్రశాంతంగా జీవిస్తున్న సమయంలో ఆమె చుట్టూ ఉచ్చు బిగిసింది.

నివేదిక తప్పుల తడక..

ప్రభావతి నేతృత్వంలో మాజీ ఎంపీ వ్యవహారంలో ఇచ్చిన రిపోర్టు పూర్తి స్థాయిలో తప్పుల తడకతో కూడిందని నిర్ధారణైంది. పోలీసులు కొట్టిన దెబ్బలకు నరాలు చిట్లి అంతర్గతంగా రక్తస్రావం జరిగినట్లు కూడా గుర్తించారని రఘురామ లాయర్ కోర్టుకు వివరించారు. రఘురామను కస్టడీలో చిత్రహింసలకు గురిచేసినట్లు సుప్రీంకోర్టు సైతం ప్రాథమికంగా నిర్ధారించిందంటే ప్రభావతి బృందం ఎంత ధైర్యంతో వాస్తవ నివేదికను తారుమారు చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన మునివేళ్లకు గాయాలు ఉన్నట్లు విజయవాడలోని మెడికల్ బోర్డు నిర్ధారిస్తే ప్రభావతికి అవేవీ కనిపించలేదు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన సీఐడీ అధికారులను కాపాడేందుకు ప్రభావతి శతవిధాలా ప్రయత్నించారన్న ఆరోపణలు వస్తున్నాయి.



రేపల్లె జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రామలక్ష్మి

ఆకలి తీర్చేలా.. మధ్యాహ్న భోజనం

- కళాశాల విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ పథకం
- సంతమాగులూరు, రేపల్లెలో ప్రారంభించిన మంత్రులు

బాపట్ల, రేపల్లె, సంతమాగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ పేరుతో జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 16 కళాశాలల్లోని 1971 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ఆకలి బాధ తీరనున్నది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో డ్రాపవుట్స్ తగ్గడంతో పాటు విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు. రేపల్లె జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి కలెక్టర్ వెంకటమురళి పాల్గొన్నారు. అద్దంకి పరిధిలోని సంతమాగులూరు జూనియర్ కళాశాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. వేమూరులోని డీవీఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొనగా, పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చీరాలలోని యార్లగడ్డ అన్నపూర్ణమ్మ గవర్నమెంట్ డిగ్రీ మహిళా కళాశాలలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు : మంత్రి అనగాని

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయడంతో పాటు డ్రాపవుట్స్‌ను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన కలెక్టర్ వెంకటమురళితో కలిసి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన స్వల్ప వ్యవధిలోనే విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని మంత్రి చెప్పారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బడి పిలుస్తోంది పేరుతో పాఠశాల, కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకున్నా విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి సీఎం చంద్రబాబు ఈ రంగానికి ఎంతో ఖర్చు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల పదిహేను రోజుల్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తెచ్చామన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితిలోనూ డ్రగ్స్ జోలికి వెళ్లరాదని సూచించారు. వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రంలోని 44 వేల పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువుల్లో రాణించాలనే మంచి ఆశయంతో ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసిందని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, సమగ్రశిక్షఅభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, డీవైఈవో వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కె.సాంబశివరావు, కమిషనర్ కె.సాంబశివరావు, బీజేపీ, జనసే నాయకులు మాణిక్యరావు, మత్తిభాస్కరరావు, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే రాష్ట్ర పురోగతి : మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులైతేనే రాష్ట్రం అన్ని విధాలుగా పురోగమిస్తుందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు వసతులను వినియోగించుకుని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు.

మెనూ ఇలా..

సోమవారం - పొంగలి, ఉడికించిన గుడ్డు, పలావు, కోడిగుడ్డు కర్రీ, చిక్కీ
మంగళవారం - రాగి జావ, పులిహోర, టమోట, దొండకాయ కర్రీ, చట్నీ
బుధవారం - విజిటబుల్ రైస్, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం - రాగి జావ, సాంబారుబాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం - అన్నం, ఆకు కూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం - రాగి జావ, ఆకుకూర పప్పు, అన్నం, స్వీట్ పొంగలి



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి గొట్టిపాటి



భవనాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి భారతి, న్యాయాధికారులు శాంతి, ప్రశాంతి

కోర్టు భవనాలను పరిశీలించిన జిల్లా న్యాయాధికారి

పర్చూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాలను ప్రకాశం జిల్లా న్యాయాధికారి ఏ భారతి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటుపై న్యాయాధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉండే పలు భవనాలను పరిశీలించారు. ప్రధానంగా పర్చూరు మార్కెట్ యార్డులోని పలు భవనాలను పరిశీలించి వసతులు తదితర అంశాలపై అధికారులు, కోర్టు సిబ్బందితో చర్చించారు. కోర్టుని మరో భవనంలోకి మార్చడానికి అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ గురించి ఆర్అండ్‌బీ అధికారులతో న్యాయాధికారి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో రమణ, సూపరింటెండెంట్ సీహెచ్ సుధాకర్, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి, జూనియర్ సివిల్ న్యాయాధికారిణి శాంతి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఫిష్ మార్కెట్ ప్రారంభం



ఫిష్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ వినాయకపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఫిష్ మార్కెట్‌ను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిష్ మార్కెట్ ద్వారా ఉపాధి పొందేవారు నాణ్యతను, శుభ్రతను పాటించాలన్నారు. పలు సూచనలు చేశారు. వారికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

కారంచేడు(పర్చూరు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కనీసం కాలువల్లో మురుగు కూడా తీయక పోవడంతో ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచి ప్రజలు దోమలతో అల్లాడుతున్నారు. కనీసం కాలువల్లో ఎబేట్ ద్రావకాన్ని, బ్లీచింగ్‌గానీ పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ప్రజల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డ్రైనేజ్ వ్యవస్థను మెరుగు పరిచే విధంగా ఇప్పటికే శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శనివారం గ్రామంలోని డ్రైనేజీ కాలువల్లో దోమల నివారణకు ఎబేట్ ద్రావణంతోపాటు, ఆయిల్‌ను పిచికారీ చేసే పనులు చేపట్టారు. గత కొంత కాలంగా ఆలనా పాలనకు నోచుకోని డ్రైనేజీ కాలువలో ఇలా దోమల నివారణ చర్యలకు కార్యక్రమం చేపట్టడంతో ప్రజలు కొంత విస్మయానికి గరయ్యారు.

ప్రసాద్‌కు అభ్యుదయ రైతు పురస్కారం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగు చేస్తూ ఏటా అధిక దిగుబడులను సాధిస్తున్న దాట్ల శివ శంకరప్రసాద్‌కి అభ్యుదయ రైతు పురస్కారం దక్కింది. మండలంలోని రాజుగారిపాలెం గ్రామానికి చెందిన ప్రసాద్‌ను శనివారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా రైతు నేస్తం ఫౌండేషన్, రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో పుసరస్కారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు జ్ఞాపిక, శాలువాతో ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ



లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చూపులేని విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం వేదవతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంఈవో లూయీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదరికంలో పుట్టిన ఆరోగ్యం సహకరించక పోయినా బ్రెయిలీ లిపి కనుగొని అంధుల పాలిట ఆరాధ్య దైవం అ య్యారన్నారు. ప్రతి విద్యార్థి లూయి బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లును బధిరులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంగులూరు : అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలుస్తారని, వారి జీవితాలలో బ్రెయిలీ వెలుగులు నింపారని భవితా కేంద్రం నిర్వాహకులు కొనియాడారు. భవిత కేంద్రంలో శనివారం లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం లలితకుమారి, మస్తాన్‌వలి, ఐఈడీ ఆర్పీలు యోహాన్, అరుణ, కల్పాన, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బోనోఫిక్స్, ఫెవికాల్స్‌తో యువత భవిత చిత్తు

- గంజాయి కట్టడితో వాటికి బానిస
- మద్యం మత్తు చాలక ఎక్కువగా కొనుగోలు
- వస్త్రంలో వేసుకుని నేరుగా ముక్కుల ద్వారా పీల్చుతున్న కుర్రాళ్లు
- విక్రయాలను ఆపకుంటే నేరాలు పెరిగే అవకాశం





చీరాలటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఎట్టకేలకు కొంతమేర గంజాయి విక్రయాలు నియంత్రించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరలకే మద్యం విక్రయాలు జరపుతుండడంతో చాలా వరకు పరిస్థితులు పర్వాలేదని పించాయి. దీంతో హమ్మయ్యా అని ఊపిరిపీల్చుకునే లోపే మరో పిడుగు పడినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గంజాయికి బానిసలుగా మారిన వారికి మద్యం మత్తు సరిపోక పోవడంతో తాజాగా బోనోఫిక్స్, ఫెవికాల్ ఎస్ఆర్ 505లకు బానిసలుగా మారుతున్నారు. ఇది మార్కెట్‌లో వివిధ మోదాతుల్లో రూ.50లోపే ఉండి మత్తును అధికంగా ఇస్తుండడంతో అందరూ ఇటు దారులు తీఆరు. దీంతో దుకాణదారులు కొనుగోలు దారుల అవసరాలను అనుగుణంగా మలుచుకుని ధరలు డబుల్ చేసి విక్రయాలు జరుపుతున్నారు. అయితే ఈదుస్థితి ఇప్పటికే చాలా వరకు చాపక్రింద నీరులా మారి విస్తరిస్తుంది. మైనరల్, మేజర్‌లు అని తేడా లేకుండా వీటని కొనుగోళ్లు చేసి వినియోగిస్తున్నారు. ఈమధ్య కాలంలో ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ నుంచి పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ వరకు, వీధుల శివారు ప్రాంతాలు, శ్మశాన వాటికల్లో యువత ఇదే తంతు కొనసాగిస్తున్నారు. అయితే ఈ క్రమంలోనే బానిసగా మారిన ఓ మైనర్‌ను వివరణ కోరగా రూ.70లోపే కొనుగోళ్లు చేసి గుడ్డలో వేసుకుని పీలిస్తే మత్తు పూర్తిగా తలకెక్కుతుందని ఆ తరువాత ఏమి జరుగుతుందో అసలు తెలియదని యథేశ్చగా చెప్తున్నాడు.

ఇటువంటి సందర్భాల్లో వారు ఎలాంటి ఘటనలకైనా పాల్పడడంలో సందేహం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విధంగా చూసుకుంటే బోనోఫిక్స్ వస్త్రంలో ఊగిసలాడుతున్న వీరికి పోలీసు యంత్రాంగం అడ్డుకట్ట వేయాల్సి ఉంది. లే కుంటే భవిష్యత్తులో ఎటువంటి ఘోరాలు చవిచూడాల్సి వస్తుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు. అలాగే బోనోఫిక్స్, ఫెవికాల్స్ అమ్మకాలు జరిపేందుకు దుకాణ దారులకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. లేకుంటే నేరాలకు అడ్డు అదుపు ఉండదన్నది జగమెరిగిన సత్యం.

నేరాల నియంత్రణకు చర్యలు



చాలా వరకు గంజాయిని కట్టడి చేశాము. అందుకు మొత్తం పోలీసు యంత్రాంగం చాలా కష్ట పడింది. అయితే ప్రత్యామ్నాయంగా భావించిన మత్తు బాబులు ఇటీవల బోనోఫిక్స్ ఫెవికాల్ ఎస్ ఆర్ 505 వంటి వాటిని సేవిస్తున్నట్లు గమనిస్తున్నాము. వీటిపై ప్రజలతో పాటు దుకాణ దారులకు అవగాహన కల్పిస్తాము. నేరాల నియంత్రణకు పోలీసు శాఖ పారదర్శకంగా పని చేస్తుంది.

ఎండీ మొయిన్, డీఎస్పీ చీరాల

మొక్కజొన్నను ముంచిన కలుపు మందు

- రంగుమారి ఎండిపోయిన పైరు
- బోరుమంటున్న రైతులు
- మూడు గ్రామాల్లో 30 ఎకరాలలో అట్రోజిన్ వాడకం
- శాస్త్రవేత్తలను రప్పిస్తామంటున్న ఏవో



కొండమూరులో ఎదుగుదల లేని మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కలుపు నివారణకు మొక్కజొన్న పైరులో కలుపు మందు వాడితే అసలు పైరుకే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు మండలంలోని కొండమూరు, రేణంగివరం, బైటమంజులూరు, కోటపాడు గ్రామాలలో ఇలా జరిగింది. వివరాల్లోకి వెళితే.. రబీలో సాగుచేసిన మొక్కజొన్న పైరులో కలుపు నివారణ కోసం పలువురు రైతులు ముప్పవరంలోని హనుమాన్ ట్రేడర్స్ దుకాణంలో అగస్త్య కంపెనీకి చెందిన అట్రోజిన్ పురుగు మందును కొని తెచ్చి పైరుపై పిచికారీ చేశారు. కలుపు నివారణ కోసం వాడిన మందుతో పైరు రంగుమారడంతోపాటు ఎండిపోతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని నాలుగు గ్రామాలలో రైతులు మొక్కజొన్నలో కలుపు నివారణకు అట్రోజిన్ మందును వాడారు. ఈ మందు వాడిన పొలాల్లో పైరు రంగు మారి, ఎదుగుదల నిలిచి ఎండుముఖం పట్టే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన మొక్కజొన్న పైరును చూసి అగస్త్య కంపెనీ తమ కొంప ముంచిందని వాపోతున్నారు.



మోములో మందుపడి రంగు మారి ఎండుతున్న పైరు

మండలంలోని కొండమూరు, బైటమంజులూరు, రేణంగివరం, కోటపాడు, ముప్పవరం గ్రామాల రైతులు 45 రోజుల కిందట మొక్కజొన్న సాగు చేపట్టారు. పొలాలలో కలుపు అధికంగా కనిపించడంతో దాని నివారణకు ముప్పవరంలోని హనుమాన్ ట్రేడర్స్‌లో అట్రోజిన్ మం దును కొనుగోలు చేసి 15 రోజుల కిందట మందును పైరుపై పిచికారీ చేశారు. మందు వాడిన అనంతరం పైరుపై మ చ్చలు ఏర్పడడం, రంగుమారడం, తర్వాత ఎండుముఖం పట్టడం, మోము కుళ్లిపోవడంతో రైతులు షాపు యజమానిని ఆశ్రయించారు. షాపు యజమాని 19:19:19తో పాటు బయోస్టిమిట్ హ్యూమిక్ యాసిడ్ వాడితే పైరు ఎదుగుదల ఉంటుందని ఉచితంగా మందు సమకూర్చారు. అవివాడినా పైరులో ఎలాంటి మార్పు లేకపోవడంతో కల్తీ మందుతో తాము నష్టపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



పిచికారీ చేసిన అట్రాజిన్ మందు ప్యాకెట్

శాస్త్రవేత్తలను రప్పించి పరిశీలిస్తాం

మండలంలోని నాలుగు గ్రామాలలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు వాడిన అట్రోజిన్ మందుతో తలెత్తిన పరిస్థితిని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి శనివారం పరిశీలించారు. మోము కుళ్లిపోవడం, పైరు ఎదుగుదల లేకుండా రంగు మారడం గుర్తించడం జరిగిందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. పరిస్థితిని అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలను రప్పించడం, వాడిన మందును ల్యాబ్‌లో పరీక్షకు పంపనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించి తగు చర్యలు చేపడతామన్నారు.

\- ఏవో సుబ్బారెడ్డి

పైరు ఎండుముఖం పట్టింది



రెండెకరాలలో మొక్కజొన్న సాగు చేశానని కలుపు మందు వేయడంతో పైరు పూర్తిగా ఎండుముఖం పట్టిందని బైటమంజులూరు మహిళా రైతు సక్కుబాయమ్మ వాపోతున్నారు. ఎకరాకు రూ.40వేల వరకు ఖర్చు చేశానని చెప్పారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు.

\- సక్కుబాయమ్మ

రైతులను ఆదుకోవాలి

రైతులు మొక్కజొన్న సాగుకు ఇప్పటికే రూ.40వేల వరకు ఖర్చు చేశారని రైతు సంఘం జిల్లా ప్రతినిధి తలపనేని రామారావు అన్నారు. బైటమంజులూరు గ్రామంలో ఎండుముఖం పట్టిన మొక్కజొన్న పైరును సంఘ ప్రతినిధులతో కలసి పరిశీలించారు. విత్తనాలు, ఎరువు లు, పురుగు మందుల కల్తీలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు.

\- రామారావు, రైతు సంఘం నేత

భూసమస్యల శాశ్వత పరిష్కారానికే సదస్సులు



పునుగోడులో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం మండల పరిధిలోని పునుగోడు గ్రామంలో జ రిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడా రు. ఈనెల 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జి ల్లాలో నిర్వహించిన సదస్సుల్లో 14వేల వరకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ అర్జీలకు 45 రోజులలోపు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామ న్నారు. రీసర్వే పూర్తయిన గ్రామంలో జాయిం ట్ ఎల్‌పీఎం, వీస్తీర్ణంలో లోపాలు ఉన్నట్లు అర్జీలు వచ్చినట్టు చెప్పారు. నిబంధనల ప్రకారం నోటీ సులు ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రభుత్వ భూ ముల పరిరక్షణ, భూ సమస్యలు సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో రెవె న్యూ సిబ్బంది, అధికారులు ప్రజల కు జవాబుదారీగా పనిచేసేలా దృష్టి సారించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు కలెక్టర్ అన్సారియా సీమంతం చేశారు.

తొలుత గార్లపేట రోడ్డులోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీ లించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యేతో క లసి సందర్శించారు. ఆసుపత్రిలో ని కంగారు కేర్ సెంటర్‌ను పరిశీ లించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్ డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, డాక్టర్ సుబ్బా రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని, తదితరులు పా ల్గొన్నారు.

జిల్లాస్థాయిలో చినారికట్ల విద్యార్థుల సత్తా

కొనకనమిట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శుక్రవారం విద్యాశాఖ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో చినారికట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.కోటిరెడ్డి మాట్లాడుతూ రైతుల పొలాల చుట్టూ కోతులు, అడవి జంతువులు ప్రవేశించకుండా ఫెన్సింగ్ వేసి కరెంట్ సరఫరా ఇస్తుండం. దీని ద్వారా పంటపొలాలను కాపాడుకోవాలని ఉద్దేశ్యంతో రైతులు చేస్తుంటారు. విద్యుత్ కంచే ద్వారా అడవి జంతువులకు, మనువులకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల పదవతరగతి విద్యార్థులు మారవతు వర్షనాగసాయి. బరిగే వీరేంద్ర, రైతుల సలహాలతో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గుంటూరి హైజాక్‌బాబు సూచనలు, సలహాల మేరకు మానవీయ కంచే అనే ప్రాజెక్టును తయారు చేశారు. ఈ ప్రజెక్టులో సోలార్, బ్యాటరి సహాయంతో 9 ఓల్టల విద్యుత్ కంచేకు సరఫరా అయ్యేలా ప్రాజెక్టను తయారు చేశారు. ప్రాజెక్ట్ వలన అడవి జంతువులు, మానవులకు ప్రాణహాని ఉండదని పంటలను పరిరక్షించుకోవచ్చన్నారు. ఒంగోలులో 3వ తేదీన జరిగిన సైన్స్‌ఎగ్జిబిషన్‌లో వారు రూపొందించిన ప్రాజెక్టను ప్రదర్శంచారు. ఈప్రాజెక్టుకు కొనకనమిట్ల మండలం చినారికట్ల జిల్లాపరిషత్‌ఉన్నతపాఠశాలల విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు.

సీసీరోడ్ల పనులను వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

ఒంగోలు(రూరల్), జనవరి4(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కా ర్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశిం చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి చేసిన సీసీరోడ్ల నిర్మాణ పనుల కు వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. అందువల్ల వాటికి సంబం ధించిన బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రా ష్ట్ర ప్రభుత్వం సిమెంట్ రోడ్డులు నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సీఎం కార్యాలయం సమీక్షిస్తున్నారని చెప్పారు. ఒం గోలు, సంతనూతలపాడు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు నియో జకవర్గాల్లో అధికారులు మరింత దృష్టిపెట్టాలన్నారు. పనులు సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ల సహకారం తీసుకుని సమన్వయంతో పను లు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ జి.అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంపు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసన మండలి సభ్యుడు దామూరి రామిరెడ్డి స్మారక మెడికల్‌క్యాంపు ఆ దివారం ఒంగోలులోని నెల్లూరు బస్టాండులో గల టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మాదాల వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఫిట్స్ పక్షవాతంకలిగిన రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200లకు అందిస్తామన్నారు. పలువురు డాక్ట ర్లు పాల్గొంటారని, వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

ఒంగోలు క్రైం, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమా నికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం ఒంగోలులోని జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్డ్ కా ర్యాలయం ఆవరణలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎస్పీ దామోద ర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంత నిధులు కేటాయించడం అ భినందనీయమని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఎలాంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్బారావు సస్పెన్షన్!

- మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించినందుకు చర్యలు
- పాఠశాల విద్య ఆర్జేడీ ఉత్తర్వులు
- పనిచేసిన చోటల్లా వివాదాస్పదమే!

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించిన మైనంపాడు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావుపై వేటుపడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలులోని రామచంద్రమిషన్‌లో టీచర్లకు శిక్షణ జరుగుతోంది. ఈ సందర్భంగా సుబ్బారావు వ్యవహార శైలి, ప్రశ్నించారని ఉపాధ్యాయురాళ్లను పురుష టీచర్ల మధ్యలో కూర్చోబెట్టిన వైనంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఆర్జేడీ స్పందించారు. శనివారం శిక్షణ కేంద్రానికి వచ్చిన ఆయన ఉపాధ్యాయులను విచారించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది ఉపాధ్యాయులు సోమా సుబ్బారావుపై ఫిర్యాదులు చేశారు. అక్కడ ఏం జరిగిందన్న విషయాన్ని లిఖితపూర్వకంగా కూడా ఆర్జేడీకి ఉపాధ్యాయులు రాసి ఇచ్చారు. సుబ్బారావు మహిళా టీచర్ల పట్ల దురుసుగా వ్యవహరించిన విషయం వాస్తవమని తేలడంతో ఆయన్ను ఆర్జేడీ సస్పెండ్ చేశారు. సుబ్బారావు గతంలోనూ తాను పనిచేసిన చోటల్లా వివాదాస్పదునిగా గుర్తింపు పొందారు. సర్వశిక్షా అభియాన్‌లో పనిచేసే సమయంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. డైట్ లెక్చరర్‌గా ఉన్న సమయంలో డీఈడీ కళాశాలలకు అనుమతులు, ప్రాక్టికల్ పరీక్షల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కందుకూరు ఉప విద్యాధికారిగా పనిచేసినప్పుడు అక్కడ కార్యాలయానికి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులు పొందిన వారు ఇచ్చిన ఫర్నిచర్‌ను ఒంగోలులోని తన ఇంటికి తరలించారు. ఇది వివాదాస్పదం కావడంతో ఆ సామగ్రిని తిరిగి కందుకూరు కార్యాలయానికి చేర్చారు.

రామదండు కదిలింది

కురిచేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామదండు మహాభక్త సమూహం శనివారం సాయంత్రం కురిచేడు నుంచి మండలంలోని నమశ్శివాయపురం గ్రామానికి తరలివెళ్లింది. రామేశ్వరం నుంచి శ్రీరాముని పీఠంతో గ్రామగ్రామాన తిరుగుతూ శ్రీరాముని చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతిగ్రామంలో గ్రామస్థులంతా కలసి తమ గ్రామానికి ఆహ్వానించి రామాలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి పక్క గ్రామానికి అందజేసి వస్తున్నారు. ఈక్రమంలో కురిచేడు మండలంలోని పేరుబొట్లపాలెం గ్రామానికి మొదట రామదండు రాగా అక్కడ నుంచి కాటంవారిపల్లెకు, అక్కడ నుంచి గొల్లపాలెంకు రామదండు వచ్చింది. గొల్లపాలెం నుంచి శుక్రవారం రాత్రి కురిచేడు కోదండరామాలయానికి భక్తుల కోలాహలంతో శ్రీరామనామ జపంతో తీసుకువచ్చారు. శనివారం కురిచేడు నుంచి నమశ్శివాయపురం గ్రామానికి తరలించారు. నమశ్శివాయపురం గ్రామ పొలిమేరలో ఆ గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆహ్వానం పలికారు. కురిచేడు భక్తులు వారికి శ్రీరాముని పీఠం అందజేసి తిరిగివచ్చారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండరామాలయ కమిటీ, గ్రామ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

దొనకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బూచేపల్లి ట్రస్టు సహకారంతో ఏర్పాటుచేసిన స్టడీ మెటీరియల్‌ను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ పేద విద్యార్థులకు, పేదలకు బూచేపల్లి ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, షేక్ అమీర్, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, వైసీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యాలయంలో తనిఖీ

» క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్‌కు పునాది

» మెనూ ప్రకారం శుచి, రుచిగా భోజనం అందించాలి » డీఈవో పురుషోత్తం



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

బల్లికురవ. జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్‌కు పునాది వేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.పురుషోత్తం అన్నారు. గత నెల 27వ తేదీన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'విద్యార్థులకు వంట కష్టాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై డీఈవో స్పందించారు. ఈ మేరకు ఆయన శనివారం కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వంట చేసే పోస్టులు రెండు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులే కొన్ని రోజులు వంట చేసి పెట్టారని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా, అయన ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట కొత్త వారిని నియమించామని తెలిపారు. మెనూ ప్రకారం శుచి, రుచిగా భోజనం అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ చదువుతో పాటు తల్లిదండ్రులు మీపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్ట పడి చదవాలన్నారు. బడి మానేసిన విద్యార్థినులకు ఏర్పాటు చేసిన విద్యాలయంలో అన్ని వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయనతోపాటు ఏఎస్‌వో శ్రీనివాసరావు, ఎంఈవో కె.రమేష్, ప్రిన్సిపాల్ సరళకుమారి ఉన్నారు.

భోజన పథకం విద్యార్థులకు వరం

ఎమ్మెల్యే కొండయ్య


విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ భోజన పథకం పేరుతో జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాన్న భోజనం అందించటం విద్యార్థులకు ఓ వరమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక వైపే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాన్న భోజన పథకంను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వనరులు, వసతులు కల్పనలో భాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు మధ్యాన్న భోజన పథకం అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. రుచి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ హ్యాండ్లూమ్స్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, డాక్టర్ పొగడదండ రవికుమార్, కళాశాల అధ్యాపకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

బల్లికురవ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం వరం లాంటిందని విద్యార్థులందరూ సద్వినియెగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన భోజన పథకాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అధికారులు దగ్గరుండి భోజనం వడ్డించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వం కాలేజీల్లో నాణ్యమైన బియ్యంతో భోజనం కూడా అందజేస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుధాకర్, ఎంఈవో రమేష్, ఉన్నత పాఠశాల హెచ్ఎం హనుమంతురావు, ఎంపీ ఫౌండేషన్ హరిహరన్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈవో,ఉపాధ్యాయులు

మార్టూరు : భోజన పథకాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. శనివారం పథకాన్ని జూనియర్ కాలేజీలో ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డివి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగపర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వైద్యులు డాక్టర్ సీహెచ్.ఫణింద్రబాబు అన్నారు. శనివారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ పేరుతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఆ యన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వరమ్మ, హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, కౌన్సిలర్లు తిరుపతమ్మ, జాకీరా, రమేష్‌బాబు, కంపా రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్చూరు : బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శేషకుమారి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల సౌలభ్యం కోసం భోజనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, హెచ్ఎం రాజశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం


ప్రజావేదికలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాలను నిర్వహిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. సంతమాగులూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 147 మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శించిన మంత్రి

బల్లికురవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రావులపల్లి గోవిందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం గుడిపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను విద్యుత్ శాఖ మంత్రి గొ ట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. టీడీపీ విజయానికి అయన చేసిన కృషిని ఈసందర్భంగా మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

కాకినాడకు ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ అద్దంకి మండల శాఖ ఆధ్వర్యంలో కాకినాడలో జరుగుతున్న యూటీఎఫ్ మహాసభలకు శనివారం ప్రత్యేక వాహనాల్లో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. యూటీఎఫ్ జిల్లా నాయకుడు జె.బాబూరావు, బి. చంద్రశేఖర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, పూర్ణచంద్రరావు, రామాంజనేయులు, రాజశేఖర్, గంగాధర్, కేశవరావు, హనుమంతరావు, కోటి, ఆంజనేయులు, శ్రీను, ప్రతాప్ పాల్గొన్నారు.

బల్లికురవ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల కోసం కాకినాడకు సంఘ నేతలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో శనివారం తరలివెళ్లారు. ఆది, సోమవారం అక్కడ మహాసభలు జరుగనున్నాయి. తొలిరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతున్నట్లు నాయకులు ధూళిపాళ్ల శేషగిరి, రామాంజనేయులు, అచ్యుత్‌మోహన్, కృష్ణయ్య, విజయలక్ష్మి, రాణి, కల్యాణి, సరిత, ముంతాజ్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

అదృశ్యంపై కేసు

వేటపాలెం (చీరాల), జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కాయిపాలెంకు చెందిన తల్లీ కూతురు అదృశ్యంపై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అక్కాయిపాలెంకు చెందిన మహిళ తన రెండేళ్ల కమార్తెతో కలసి 31వ తేదీ రాత్రి చర్చికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఈ నేపథ్యంలో ఆమె తల్లి వసంత ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు మార్టూరులో జాబ్‌మేళా

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయ, సీడాఫ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మార్టూరులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, టాటా క్యాపిటల్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రిమెంట్ ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు హాజరవుతాయన్నారు. ఆసక్తి గలిగిన నిరుద్యోగ యువతీ యువకులు డైరెక్టుగా ఇంటర్వ్యూ హాజరుకావాలన్నారు. అంతేగాకుండా మరిన్ని వివరాలకు సెల్ నంబరు 7989697996 ను సంప్రదించాలన్నారు.

నిర్ణీత వ్యవధిలో భూ సమస్యలు పరిష్కరిస్తాం

పంగులూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులలో గుర్తించిన సమస్యలు నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ సింగారావు తెలిపారు. మండలంలోని రేణింగివరం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేతో పాటు రెవెన్యూ సదస్సులలో తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అందుకు రైతులు సహకరించాలని కోరారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, టీడీపీ గ్రామ నాయకులు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. చింతగుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం రెవెన్యూ సదుస్సు కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు అన్నారు. సదస్సులో భూ సర్వేకి ఒకటి, పట్టాదారు పాసుపుస్తకాల కోసం మూడు, పేర్లు సరిచేయట కొరకు ఐదు, ఆదాయ సర్టిఫికేటు కోసం ఒకటి, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ కోసం ఒకటి, కుల ధ్రువీకరణకు నాలుగు ఆర్జీలను స్వీకరించనట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గన్నారు.

మార్టూరు : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీ ప్రశాంతి తెలిపారు. వాటిలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 8, సర్వే కోసం 5అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు ఏడుకొండలు, దేవదాయ ఈవో శిరీష పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటి ఫొటో లేకుండా ఫ్లెక్సీ

ఆలస్యంగా గుర్తించి మరొకటి ఏర్పాటు



మంత్రి గొట్టిపాటి ఫొటో లేని ఫ్లెక్సీ, కాసేపటి తర్వాత ఇలా

అద్దంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫొటో లేకుండా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఫోటోలతో ఏర్పాటు చేశారు. అనంతరం ఆలస్యంగా గుర్తించి ఆ ఫ్లెక్సీని తొలగించి అప్పటికప్పుడు మంత్రి రవి కుమార్ ఫొటోతో మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.


సత్యనారాయణను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

శింగరకొండలో దేవదాయశాఖ కమిషనర్ పూజలు

అద్దంకి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వదించి సత్కరించారు. దేవాలయం రాతి ముఖ మండపం పునః నిర్మాణ పనులను పరిశీలించారు. ఈవో, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శైలేంద్రకుమార్, కోటిరెడ్డి పాల్గొన్నారు.


వ్యర్థాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వెనువెంటనే వ్యర్థాల తొలగింపు

పర్చూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - చీరాల ఆర్ అండ్‌బీ రహదారి మార్జిన్‌లో వ్యర్థాలను వెనువెంటనే తొలగించారు. గ్రామాల్లోని వ్యర్థాలను తెచ్చి పోయడంతో అవి కాస్త డంపింగ్ యార్డులా మారాయి. రోడ్డు మార్జిన్‌లో పేరుకున్న వ్యర్థాలను తొలగించాల్సిన సిబ్బంది నిప్పంటించారు. దీంతో వచ్చే పొగ రోడ్డును కమ్మేయడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై వ్యర్థాలకు నిప్పు-ప్రాణాలకు ముప్పు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు శనివారం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, కార్యదర్శి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ట్యాంకర్‌ను ఏర్పాటుచేసి మంటలను ఆర్పివేయడంతోపాటు, ఎక్స్‌కవేటర్ సహాయంతో వ్యర్థాలను తొలగించారు.

పేద మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేత


కుట్టు మిషన్‌లను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నవాబ్‌పేటలో పదిమంది నిరుపేద మహిళలకు రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్‌లు అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్, బిజిఆర్ మైన్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంయుక్త సహకారంతో శనివారం సుమారు రూ.లక్ష విలువ గల మిషన్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబంలో భర్తకు చేదోడు వాదోడుగా నిలిచేందుకు మహిళల దాతల చేయూతతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బాచిన నాగ మల్లేశ్వరరావు, కార్యదర్శి ముప్పల వంశీకృష్ణ, కోశాధికారి డా.రవితేజ, సభ్యులు మల్లికార్జున రమణ, రామకృష్ణ, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, పండ్లు అందజేత

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని వృద్ధాశ్రమానికి వాసవి ధనవంత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. శనివారం గుర్రం వెంకట కావ్య పుట్టిన రోజు సందర్భంగా వాటిని అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, వెంకట కావ్యారావు, ఆశ్రమ ఇన్‌చార్జి హనుమంతరావు పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యం సాధించాలి

అద్దంకిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని పదివ తరగతి విద్యార్థినులకు మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ, రోటరీ మాజీ అధ్యక్షుడు సందిరెడి శ్రీనివాసరావు సహకారంతో మోడల్ టెస్ట్ పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, పసుపులేటి ఆంజనేయులు, ప్రిన్సిపాల్ దుర్గ గాయత్రి, న్యాయవాది గృహలక్ష్మి, గుంజి హనుమంతరావు పాల్గొన్నారు.


విద్యార్థినులకు మోడల్ టెస్ట్ పేపర్‌లను అందజేస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరులో దొంగల హల్‌చల్

» అపార్ట్‌మెంట్‌తో పాటు మరో ఇంటిలో చోరీకి ప్రయత్నం

» పరిశీలించిన క్లూస్ టీం


సీసీ పుటేజీలో కనిపిస్తున్న అగంతకుడు

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) :మార్టూరులో నాగరాజుపల్లి రోడ్‌లో సాయి మల్లికార్జున అపార్టమెంట్‌లో శనివారం అర్ధరాత్రి 2 గంటల తర్వాత ముగ్గురు దొంగలు హల్ చల్ చేశారు..అక్కడ దొంగతనం చేసే అవకాశం లభించకపోవడంతో అపార్ట్‌మెంట్ ఎదురుగా రోడ్డుకు అవతలవైపు ఉన్న దండా నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో చోరీ చేయడానికి ప్రయత్నించారు. కానీ వారికి ఈ ఇంటిలో ఎలాంటి వస్తువులు కాని నగదు కాని లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఈ తతంగం అంతా 2 గంటల 20 నిమిషాలు నుంచి సుమారు 3 గంటల 20 నిమిషాలు వరకు జరిగినట్లు అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలన లో వెల్లడయ్యింది. అంటే దాదాపుగా గంటకు పైగా దొంగలు హల్‌చల్ చేసినట్లు సమాచారం.

అపార్ట్‌మెంట్‌లో అన్నిఫ్లోర్లూ వెతికారు

సీసీ పుటేజీలో నమోదయిన వివరాలు ప్రకారం 2 గంటల 20 నిమిషాలకు ముగ్గురు దొంగలు అపార్ట్‌మెంట్ లోపలకు ప్రవేశించారు.ఈ అపార్ట్‌మెంట్‌లో 5 ఫ్లోర్లు,వాటిలో 30 గదులు ఉన్నాయి. అయితే దొంగలు లోపలకు ప్రవేశించే సమయంలో రెండు సీసీ పుటేజీలకు చెందిన వైర్లు కత్తిరించినప్పటికీ ఇంకా నాలుగుసీసీ పేటేజీలను వారు గమనించలేదు.దాంతో దొంగలు కదలికలు సీసీ పుటేజీలో నమోదయ్యాయి. వారు దాదాపుగా అన్ని ఫోర్లులో తిరిగారు. వారిలో ఒక వ్యక్తి ముఖానికి మాస్క్‌తో ఒక చేతిలో మారణాయుధంతో రెండవ ఫ్లోర్‌లో తిరిగిన దృశ్యాలు మనకు సీసీ పుటేజీలో కనిపించాయి. ఈ సమయంలో అపార్ట్‌మెంట్‌లో గదులలో ఉన్న వారంతా గాఢ నిద్రలో ఉండడం, ఎవరూ బయటకు రాకపోవడంతో దొంగలు నిర్భయంగా అపార్ట్‌మెంట్ అంతా కలియతిరిగారు. దాదాపుగా 40 నిమిషాలు గడిచిన తర్వాత దొంగలు అపార్ట్‌మెంట్ పడమర వైపు ఉన్న గేటు గుండా బయటకు వచ్చి రోడ్డుపై వేగంగా పరుగెత్తుతూ, దండా నాగేశ్వరరావు ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటి యజమాని నాగేశ్వరరావు కుటుంబం కర్నాటకలో పొలం సాగుచేసుకోవడానికి వెళ్లడంతో దొంగలు ఇంటి తాళం పగుల గొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాను తెరచి అందులో విలువైన వస్తువులు లేకపోవడంతో దుస్తులను చిందరవందర చేసి వెళ్లిపోయారు. అయితే ఈ సమయంలో వాకిలి వద్ద రోకలిబండతో ఒక వ్యక్తి కాపలాగా ఉన్నట్లు వారు అక్కడ వదిలివేసిన రోకలిబండ మనకు కనిపించింది.

ఫోన్ చేసిన నాగేశ్వరరావు

గతంలో ఆరు నెలలు కిందట నాగేశ్వరరావు ఇంటిలో చోరీ జరిగింది. అతను కర్నాటకలో పొలంసాగు చేయడానికి వెళ్లడంతో ఈ ఇంటిలో ఎవరూ లేరు. అయితే అతను ఇంటి ముందు సీసీ పుటేజీలను ఏర్పాటు చేయడంతో శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు సీసీ పుటేజీలో ఇంటికి సంబంధించి కనిపించిన దృశ్యాలు 3 గంటల తర్వాత కనిపించకపోవడంతో నాగేశ్వరరావు అపార్ట్‌మెంట్‌లో ఉన్న వాచ్‌మన్ శ్రీనివాసరావుకు తన ఇంటిలో ఏదో జరిగిందని ఫోన్ చేశారు. దాంతో వాచ్‌మన్ శ్రీనివాసరావు అపార్ట్‌మెంట్‌లోని అందరినీ నిద్రలేపడం, వారంతా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి చూడడం, అక్కడ దొంగతనం జరిగిందని గ్రహించి, తర్వాత తమ అపార్ట్‌మెంట్ సీసీ పుటేజీలను పరిశీలించగా, దొంగలు మొదట తమ దగ్గరకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని సెంటరులో బీట్ నిర్వహిస్తున్న పోలీసులకు చెప్పడంతో వార వచ్చి పరిశీలించారు. సాయంత్రం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు.

కావూరివారిపాలెంలో క్షుద్రపూజ కలకలం

» హడలెత్తిన ప్రజలు

» రీల్స్ కోసమని తెలిసి నవ్వుకున్నవైనం

కావూరివారిపాలెం (చీరాలటౌన్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెంలో శనివారం తెల్లవారుజామున క్షుద్రపూజ కలకలం రేపింది. ఆంధ్రకేసరినగర్ గ్రామ నడిబొడ్డులో ముగ్గు వేసి ఉంది. ఆ ముగ్గు మధ్యలో అక్కడక్కడా గేదె వెంట్రుకలు, నిమ్మకాయలు, మిరపకాయలు కూడా ఉన్నాయి. గ్రామంలో అధిక శాతం కూలీనాలీ చేసుకుని జీవించే వారు కావడంతో నాలుగు గంటలకే రోడ్డుమీదికి వచ్చారు. రోడ్డుపై ముగ్గు వేసి ఉండడం చూసి ఇది చేతబడి ముగ్గంటూ హడలెత్తారు. అసలేం జరుగుతుంది.. ఇప్పుడేమి చేయాలని ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో అప్పుడే నిద్రలేచి కళ్లు నలుపుకుంటూ వచ్చిన ఓ పోరగాడు ఇది యూట్యూబ్‌లో రీల్స్ కోసం రాత్రి మేమే వేశామని తాపిగ్గా చెప్పాడు. దీంతో అందరూ నవ్వుకుంటూ ముక్కున వేలేసుకున్నారు. పోరగాడికి చీవాట్లు పెట్టారు. ఈ మధ్య కాలంలో యువత రీల్స్ మోజులో పడి లైకుల కోసం ఇలాంటి చేష్టలు చేయడం పరిపాటిగా మారింది.

పోక్సో కేసు నమోదు

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి 25 ఏళ్ల యువకుడు లైంగికదాడియత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి


ఉమ (ఫైల్)

మార్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో భర్తను,మరిదిని కోల్పోయి తీవ్రగాయాలతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్లు రాంబాబు భార్య ఉమ (22) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా శనివారం తెలిపారు. ఆమె మృతదేహానికి సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో శనివారం గుం టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుం బ సభ్యులకు అప్పగించారు. నూతన సంవత్సరం రోజు జాతీయరహదారిపై విజయవాడ నుంచి ద్విచక్రవాహనంపై ధర్మవరం వెళుతున్న ముగ్గురిని లారీ ఢీకొనగా, ఆ ప్రమాదంలో తోడల్లుళ్లు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా వారిలో రాంబాబు భార్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆమె గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భవనాసి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మృతి


రాంబాబు (ఫైల్)

అద్దంకి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రాయపాలెంకు చెందిన భవనాసి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, నాగులపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ మాజీ సభ్యుడు మలిపెద్ది రాంబాబు (57) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాంబాబు శనివారం మృతి చెందారు. రాంబాబు మృతదేహం వద్ద టీడీపీ నేతలు కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

మార్టూరు,జనవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం జాతీయ రహదారిపై ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడంపై సీఐ శేషగిరిరావు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాదాలను ఆయన వివ రించారు. అంతేగాకుండా వాహనాలను సీజ్ చేస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి



నేడే ముగ్గుల పోటీలు

1 ఉదయం 10 గంటల నుంచి | సిద్ధమైన వేదికలు



నెల్లూరులో : వీఆర్ కళాశాల మైదానం
కావలిలో : రైల్వేస్టేషన్ రోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూం ఆవరణం
గూడూరులో : సనత్ నగర్‌లోని శ్రీచైతన్య కళాశాల ఆవరణం

తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం నెల్లూరు నగరం, కావలి, గూడూరు పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. నెల్లూరు నగరంలో వీఆర్ కళాశాల మైదానం (వీఆర్సీ కూడలి), కావలిలో రైల్వేస్టేషన్ రోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూం ఆవరణం, గూడూరులోని సనత్‌నగర్‌లో శ్రీచైతన్య కళాశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో జరిగే పోటీలకు నెల్లూరులోని సీఎంఆర్ చందన బ్రదర్స్ లోకల్ స్పాన్సర్‌గా ఉన్నారు. నెల్లూరులో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, మెప్మా పీడీ రాధమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. గూడూరులో డీఎస్పీ రమణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయనున్నారు. కావలిలో జరిగే పోటీలకు ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీధర్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి.

'సంక్రాంతి'కి సిద్ధమవుతున్న బరులు
ఏర్పాట్లలో పందెపురాయుళ్ల బిజీ
కోళ్ల రకాన్ని బట్టి రూ.1.5 లక్షల వరకు ధర



పందేనికి సై!

సంక్రాంతి సంబరంలో పందెపురాయుళ్లు సై అంటున్నారు. కోడిపందేల నిర్వహణకు ఎక్కడెక్కడ బరులు గీయాలో అన్వేషణ పూర్తి చేశారు. కాళ్లకు కత్తికట్టి.. బరిలోకి దింపేందుకు పందెంకోళ్లనూ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పొరుగు ప్రాంతాల నుంచి వీటిని జిల్లాకు తీసుకొచ్చి నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించారు. జాతి రకం, రంగు, డిమాండ్‌ను బట్టి రూ. 1.5 లక్షల వరకు కొన్నారు. చాటుమాటుగా తీసుకొచ్చిన ఈ కోళ్లకు పౌష్టికాహారం అందించి. బలంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక పోలీస్ దాడులు జరగకుండా సిఫారసుల కోసం నేతల వద్ద క్యూ కట్టారు.

- వివరాలు 2లో

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



- జిల్లాకు రానున్న 167 బస్సులు
- సాధారణ చార్జీలే వసూలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా దూరప్రాంతాల్లోని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపు తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం మురళీబాబు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి నెల్లూరు వచ్చేందుకు రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి 167 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ నుంచి 15 బస్సులు, 10న 35, 11న 32, 12న 35, 13న 4 బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. బెంగు ళూరు నుంచి నెల్లూరుకు 9వ తేదీన 6 బస్సులు, 10న 17, 11న 12, 12న 7 బస్సులు ఏర్పాటు చేశామ న్నారు. చెన్నై నుంచి 9వ తేదీన 5 బస్సులు, 10న 5, 11న 5, 12న 5 బస్సులు నడుపు తున్నామన్నారు. స్పెషల్ బస్సులలో సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నామని, ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించి నట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడిపేందుకూ సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

చిన్న వివాదం.. పెద్ద ఘర్షణ

- ఓ వర్గంపై మరో వర్గం యువకుల దాడి
- తీవ్రంగా గాయపడి ఓ యువకుడి మృతి
- కారకులను శిక్షించాలని దళితుల ఆందోళన
- నిందితులను తప్పిస్తున్నారంటూ ఆగ్రహం
- సర్దిచెప్పి పంపిన స్థానిక నాయకులు, పోలీసులు

అల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి వివాదం.. ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం యువతపై మరో వర్గం యువకులు దాడి చేయడంతో ఒకరు మృతి చెందారు. అయితే, ఈ కేసులో నిందితులను తప్పిస్తున్నారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం నార్తుమోపూరు కూడలిలో మృతుడి కుటుంబీకులు, బంధువులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. వివరాల్లోకి వెళితే.. అల్లూరు మండలం నార్తుమోపూరు కూడలి సమీపంలోని దళితవాడకు చెందిన చేజర్ల కార్తీక్ (24) తిరుపతిలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. రోడ్డు ప్రమాదంలో చేతికి గాయం కావడంతో విశ్రాంతి కోసమని కొన్నిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఒకే సామాజిక వర్గానికి చెందిన యువకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకొని ఘర్షణకు దారితీసింది. గ్రామస్థుల చొరవతో వివాదం సద్దుమణిగింది. కాసేపటి తరువాత 8 మంది యువకులు బైక్‌లపై నార్తుమోపూరు ప్రధాన కూడలికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇద్దరితోపాటు కార్తీక్ కూడా ఉన్నారు. ఇదే అదునుగా కొమ్మి సుధీర్, తుమ్మతాటి ఆదిత్య, కొమ్మి సురేష్, అరగల పాల్, అరగల అఫ్రాన్, అజ్జం హేమంత్, మాచాల మనోజ్, అరగల లక్ష్మయ్యలు తమతో తెచ్చుకున్న కర్రలు, రాడ్లతో దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరు తప్పించుకోగా కార్తీక్‌పై దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన కార్తీక్ అక్కడికక్కడే కూలిపోయాడు. దీంతో 8 మంది యువకులు పరారయ్యారు.

బంధువుల ఆందోళన

కార్తీక్‌పై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను అల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ నగదు చెల్లించక పోవడంతో వైద్యం అందించకుండా కాలయాపన చేశారని బాధితులు వాపోయారు. చివరకు నగదు చెల్లించాక త్వరితగతిన చెన్నైకి తీసుకెళ్లమని సిఫారసు చేశారు. దీంతో నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే కార్తీక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడికి వచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, 8 మంది కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితుడి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని మృతుడి కుటుంబీకులు రోడ్డుపై మృతదేహంతో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పినా వారు వినలేదు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలంటూ భారీగా నినాదాలు చేశారు. ఒక సందర్భంలో హరిజనవాడపై దాడికి ప్రయత్నించేందుకు అటువైపు వైపుకు దూసుకెళ్లారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నం చేసి నిలువరించారు. చివరికి స్థానిక నాయకులు కలగజేసుకొని వారికి సర్ది చెప్పగా వారు నిరసన విరమించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



పోలీసులను నిలదీస్తున్న మహిళలు



మృతుడు చేజర్ల కార్తీక్ (ఫైల్)

క్యారమ్‌లో నువ్వా.. నేనా!?

- నెల్లూరు వేదికగా జాతీయస్థాయి పోటీలు
- నేటి నుంచి 8వ తేదీ వరకు పోరు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారుల హాజరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు వేదికగా 29వ అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్ పోటీలు ఆదివారం నుంచి జరగనున్నాయి. నగ రంలోని నెల్లూరు క్లబ్ ప్రాంగణంలో భారత క్యారమ్ ఫెడరేషన్, ఆంధ్రరాష్ట్ర క్యారమ్ అసోసియేషన్‌ల సహకారంతో జిల్లా క్యారమ్ అసోసియేషన్ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దేశంలోని 25 రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిక ప్రాతాలు, భారతీయ సంస్థలకు చెందిన వారితో కలిపి 400 మంది క్రీడాకారులు, 8 మంది ప్రపంచ చాంపియన్‌లు కూడా పోటీలకు హాజరవుతున్నారు.

● ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణ

జాతీయ క్యారమ్స్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా జిల్లా అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పరుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాలు, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో అన్ని ఈవెంట్‌లను నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఏఐసీఎఫ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌గా ఈ పోటీల్లో సాధించిన పాయింట్లు భారత జట్టు ఎంపికకు కీలకం కానున్నాయి. పోటీలను తిలకించేందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసెఫ్ మేయర్, సెక్రటరీ జనరల్ డాక్టర్ వీడీ.నారాయణ్, ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు రకిబుల్ హుస్సేన్, జనరల్ సెక్రటరీ భారతి నారాయణ్, ఏపీ అధ్యక్షుడు నీరజ్‌కుమార్ సంపతి, కార్యదర్శి షేక్.అబ్దుల్ జలీల్‌లతో పాటు జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు హాజరు కానున్నారు. పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను క్యారమ్స్ ఫెడరేషన్ కప్ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, జిల్లా క్యామర్ అసోసియేషన్ కార్యదర్శి వీ .రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.



కొండాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు

విద్యార్థుల ఆకలి తీరింది!

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనం పథకం శనివారం ప్రారంభమైంది. ఆయా కాలేజీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు.

- వివరాలు 4లో..



ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీ సంఘాలు, ఇతర కుల సంఘాల నాయకులు భారీగా అర్జీలు అందచేశారు. నెల్లూరులో శనివారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆయన వినతులు స్వీకరించారు.

- వివరాలు 2లో..

తిరగబడ్డ బతుకుబండి!

ఘటనాస్థలిలో ఆటో, ఆర్టీసీ బస్సు



- హైవేపై ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- పొగమంచు, ఆపై అతివేగమే కారణం
- దంపతులిద్దరూ దుర్మరణం
- సంగం వద్ద ముంబయి హైవేపై ఘటన

ఊరూరా తిరిగి కూరగాయలు అమ్మితేనే ఆ దంపతులకు పూట గడిచేది. రోజంతా కష్టపడి వచ్చే సంపాదనతోనే తన ముగ్గురు పిల్లల్ని కంటికి రెప్పలా పెంచుతున్నారు. ఎంతో సాఫీగా సాగిపోతున్న వారి బతుకు బండి అనుకోని ప్రమాదంతో తలకిందులయ్యింది. సంగం మండలం వెంగారెడ్డి పాళెం వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై శనివారం ఉదయం ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వచ్చే ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రోడ్డుపై పొగమంచు ఓ కారణమైతే, బస్సు అతివేగమే మరో కారణమైంది. ఏదైతేనేం ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. వీరి ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు.

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనసూయ నగర్ గ్రామానికి చెందిన నెల్లూరు వెంకటశేషయ్య (35), వెంకట వరలక్ష్మి (30) దంపతులు నిత్యం ఆటోలో కూరగాయలు విక్రయిస్తూ తమ ముగ్గురు పిల్లల్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఆటోలో కూరగాయలు తీసుకుని దంపతులిద్దరూ ఇంటి వద్ద నుంచి సంగం బయలుదేరారు. పొగమంచు దట్టంగా ఉండటం, ముంబయి జాతీయ రహదారిపై వాహనాలు కనిపించకపోవడంతో నెమ్మదిగా వెంగారెడ్డి పాళెం రోడ్డు క్రాస్ చేసి కొంత దూరం వచ్చారు. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న వెంకటశేషయ్య తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో వెనుక సీట్లో కూర్చొని ఉన్న వెంకట వరలక్ష్మికి తీవ్రగాయా లు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటనాస్థలికి చేరుకుని వెంకట వర లక్ష్మిని 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవే టు వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. వెంకటశేషయ్య మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆర్టీసీ బస్సును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతులు వెంకటశేషయ్య, వెంకటవరలక్ష్మి (ఫైల్)



అనాథగా మారిన పిల్లలు

● సంఘటనా స్థలం పరిశీలన

హైవేపై ఘటనా స్థలిని ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా, ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు పరిశీలించారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు స్వయంగా బస్సును నడిపి కండీషన్‌ను పరిశీలించారు. ప్రమాదానికి ఆర్టీసీ డ్రైవర్‌తోపాటు పొగమంచు కూడా కారణమై ఉంటుందని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

● అనాథలైన ముగ్గురు పిల్లలు

ప్రమాదంలో దంపతులిద్దరూ మృతి చెందడంతో వారి పిల్లలు శివ (13), బాలాజీ (9), ప్రవల్లిక (7)లు అనాథలుగా మిగిలారు. మృతదేహాల వద్ద విలపిస్తున్న పిల్లల్ని చూసి గ్రామస్థులూ కంటతడి పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి పిల్లలను ఆదుకోవాలని కోరారు



రోధిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అబ్దుల్ అజీజ్, కమిషనర్ సూర్యతేజ

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : అజీజ్

నెల్లూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరులోని వీఆర్, పీఎస్ఎం మునిసిపల్ జూనియర్ కళాశాలల్లో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ద్వారా రాష్ట్రంలోని 44,129 స్కూళ్లు, కళాశాలల్లోని 33,81,000 మంది విద్యార్థుల ఆకలి తీరుతోందన్నారు. ప్రభుత్వం ఎన్ని కష్టాల్లో ఉన్నా విద్యార్థులకోసం ఈ పథకం తీసుకువచ్చిందన్నారు. మంత్రి నారాయణ చొరవ తీసుకుని గతంలో మాదిరిగా విద్యార్థులకు ఉచిత మెటీరియల్స్ లెక్చరర్స్‌ను కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పీఎస్ఎం కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను అజీజ్ ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు కమిషనర్ సూర్యతేజతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ హైఫా, కళాశాలల ఇన్‌చార్జి రాజేంద్ర, నేతలు జాఫర్‌షరీఫ్, నన్నేసాహెబ్, హరికృష్ణ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

త్రివిక్రమ అలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): అధ్యయనోత్సవంలో భాగంగా మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం రాత్రి త్రివిక్రమ అలంకారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆళ్వార్ల ఘోష్టి, దివ్య నాలాయర ప్రబంధ ఘోష్టి గానం, శాత్తుముర్రై జరిగాయి. ఉదయ గోదాదేవికి విశేష పూజలు జరిగాయి. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా మామిడి ఆంజనేయులు శ్రేష్టి, మామిడి హజరత్ శ్రేష్టి వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ జే శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

205 మంది మహిళా అభ్యర్థుల హాజరు



నెల్లూరు పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు శనివారం 205 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఐదోరోజు పరీక్షలకు 418 మంది హాజరు కావాల్సి ఉండగా, 205 మంది హాజరయ్యారు, 213 గైర్హాజరయ్యారు. ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలను జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు.

- నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి)

ఇంటి పేరుతోనే ప్రసిద్ధి

- ఎన్నో అద్భుత సినీగీతాల రచయిత వెన్నెలకంటి
- నేడు రాజేశ్వరప్రసాద్ 4వ వర్ధంతి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'మాటరాని మౌనమిది.. మౌన వీణ గానమిది'.... ప్రేమంటే ఏమిటంటే.. నిను ప్రేమించాక తెలిసే'.. తదితర ఎన్నో మధుర సినీ గీతాలకు ప్రాణం పోసిన గీత రచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్. ఆయన గేయ రచయితేకాక మాటల రచనతో ఎన్నో అనువాద చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేశారు. తెలుగు సినిమా రంగంలో ఆణిముత్యంగా రాణించిన ఆయన 1957 నవంబరు 30న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. ఆయన తన 11వ ఏటనే ఆటవెలదిలో 'భక్త దుఃఖ నాశ పార్వతీ సముకుటంత' శతకం రాసి అబ్బురపరిచారు. శ్రీరామచంద్రుడు సినిమాలో సినీ గేయరచయితగా అరంగ్రేటం చేశారు.

ఉద్యోగాన్ని వదలి..



వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ (ఫైల్)

1979లో ఆయన చిత్తూరు జిల్లా చంద్రగిరిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగిగా చేరారు. బ్యాంకులో పనిచేస్తుండగానే సినీ నటుడు ప్రభాకర్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. రచయిత కొంతకాలం గడిచాక ఆయన బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి సినీ గేయరచయితగా స్థిరపడ్డారు. డబ్బింగ్ చిత్రాలకు స్క్రిప్ట్ రచయితగా గుర్తింపు పొందారు. వెన్నెలకంటి దాదాపు రెండు వేలకుపైగా సినిమా పాటలు రాశారు. ఆదిత్య 369, ఘరానా అల్లుడు, ఘరానా బుల్లోడు, క్రిమినల్, శ్రీకృష్ణార్జున విజయం, సమరసింహారెడ్డి, శ్రీను తదితర చిత్రాలకు మంచి పాటలను రాశారు. ఆయన చివరిగా పెంగ్విన్ సినిమాకు పనిచేశారు. 1988లో వచ్చిన మహర్షి చిత్రానికి రాసిన 'మాటరాని మౌనమిది'... అనే పాట శ్రోతలను ఎంతో అలరించింది.

బాలు, కమల్‌తో అవిభావ సంబంధం

ప్రముఖ నేపథ్య గాయకడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ప్రముఖ సినీ నటుడు కమలహాసన్‌తో రాజేశ్వరప్రసాద్‌కు అవినాభావ సంబంధం ఉంది. కమలహాసన్ అనువాద చిత్రాలు పంచతంత్రం, పోతురాజు, దశావతారం, మన్మథ బాణం చిత్రాలు, తమిళం నుంచి వచ్చిన సరోజ, ప్రేమఖైదీ సినిమాలకు వెన్నెలకంటి మాటల రచయిత పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శశాంక్, తండ్రి బాటలోనే మాటల రచయితగా రాణిస్తున్నారు. డబ్బింగ్ చిత్రాలకు సైతం మాటలు రాస్తున్నారు. చిన్నకుమారుడు రాకేందుమౌళి పాటల రచయితగా, గాయకుడిగా రాణిస్తున్నారు.

'స్మరించుకుందాం'

జిల్లాకు కీర్తి ప్రతిష్టలు

వెన్నెలకంటి స్క్రిప్ట్‌రైటర్‌గా, పాటలు, మాటలు రచయితగా జిల్లాకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. వెన్నెలకంటి తన చిన్నతనంలో హరికథలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు బాగా వినేవారు. కళాశాలల్లో చదివే రోజుల్లో రసవినోదిని పేరుతో రేడియో ప్రసంగాలు చేశారు. 1975లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం వారు కవితల పోటీలు నిర్వహించగా, ఆ పోటీల్లో వెన్నెలకంటి కవితలు ఎంపికయ్యారు. జంధ్యాల రాసిన ఏక్ దిన్‌కా సుల్తాన్, ఈ చరిత్ర ఏ సిరాతో.. ఎవ్వనిచే జనించు, దర్పణం.. వంటి నాటకాల్లోనూ వెన్నెలకంటి నటించారు. 2021 జనవరి 5న ఆయన గుండె పోటుతో కన్నుమూశారు. ఆయన మరణం చిత్రసీమతోపాటు నెల్లూరీయులను తీవ్ర విషాదానికి గురిచేసింది.

22న వీఎస్‌యూలో నూతన కోర్సు శిక్షణ ప్రారంభం

వెంకటాచలం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూనివర్సిటీ సంయుక్తంగా ఈనెల 22వ తేదీన కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ - డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే కోర్సు శిక్షణను ప్రారంభించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త డాక్టర్ జే విజేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశానికి 18 నుంచి 25 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువత తమ దరఖాస్తులను వీఎస్‌యూ కళాశాల కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9573482179ను సంప్రదించాలని తెలిపారు.

పందేలకు సై!

- 'సంక్రాంతి'కి సిద్ధమవుతున్న బరులు
- ఏర్పాట్లలో పందెపురాయుళ్ల బిజీ
- కోళ్ల రకాన్ని బట్టి రూ.1.5 లక్షల వరకు ధర



సంక్రాంతి పండుగ వస్తోందంటే చాలు ఎక్కడెక్కడో స్థిరపడిన జిల్లావాసులంతా సొంతూళ్లకు చేరిపోతుంటారు. వీరితోపాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ప్రత్యేక అతిథులు కూడా జిల్లాకు చేరుకుంటుంటారు. అవేమని అనుకుంటున్నారా!? ఒకటి పందెపురాయుళ్లు, రెండు కోడిపుంజులు. మరో 9 రోజుల్లో పండుగ ఉండటంతో పందేల కోసం ఇప్పటికే సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. బరులు ఎక్కడ ఏర్పాటు చేయాలి.. కోడికాళ్లకు కత్తులు కట్టేవారు ఎక్కడున్నారు? పోలీసులకు సిఫారసులు తదితర పనులను ఇప్పటినుంచే ప్రారంభించేశారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

కోడిపందేల నిర్వహణకు ఉభయగోదావరి జిల్లాల తర్వాత నెల్లూరు జిల్లాకే ప్రాధాన్యత ఉంది. జిల్లాలో పందేలు ఆడేందుకు ప్రకాశం, కడప, చిత్తూరు జిల్లాలతోపాటు తమిళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది జిల్లాకు చేరుకుంటారు. ఈ క్రమంలో జిల్లాలో ఎక్కడెక్కడ పందేలు నిర్వహించనున్నారు.. సమీప పట్టణాల్లో లాడ్జీలు ఉన్నాయా? లేదా పల్లెల్లో కొన్ని రోజులపాటు ఉండేందుకు ఎవరైనా అంగీకరిస్తారా!? తదితర వాటిపై ఆరా తీస్తున్నారు.

జాతికోళ్లకు భలే గిరాకీ

పందేల కోసం ఇతర రాష్ట్రాల నుంచి జాతి కోళ్లను గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రధానంగా కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి డేగ, పండుడేగ, పర్ల, కాకి, సేతు, నవల, కొక్కిరాయి ఇలా అనేక రకాల జాతి పుంజులను కొనుగోలు చేస్తున్నారు. వీటిని జిల్లాకు తీసుకు వచ్చి ఐదు రెట్ల ఆదాయానికి విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో రూ.2వేలు ఉన్న కోడిని జిల్లాకు తీసుకువచ్చి రూ.10వేల నుంచి 15 వేల వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఇక ఉభయగోదావరి జిల్లాల నుంచి జాతి కోళ్లను రూ.70 వేల నుంచి 1.5 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక శిక్షణ

రూ.లక్షలు పోసి కొనుగోలు చేసిన జాతి పుంజులకు జిల్లాలోని రహస్య ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం అర్థగంటపాటు చెరువుల్లో ఈత కొట్టించడం, బాదం, జీడిపప్పు, పిస్తా, ఖర్జూరం ఇలా 24 రకాల పదార్థాలను కలిపి ఉండలు చేసి కోళ్లకు తినిపిస్తున్నారు. అలాగే ఎదుటి కోడిని ఎలా ఢీకొనాలో నిష్ణాతులతో శిక్షణ ఇప్పిస్తూ పందేలకు సిద్ధం చేస్తున్నారు.

వలేటివారిపాలెంలో అప్పుడే..

వలేటివారిపాలెం : మండలంలోని చుండి దాదినీడిచెరువులోని పడమర వైపు బీడుప్రాంతంలో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ పందేలు నిర్వహిస్తున్నారు. లక్ష్మక్కపల్లి, ఎగువపల్లి అయ్యవారిపల్లె, లింగన్నపాలెం చుండి, కాకర్లవారిపాలెం, యర్రారెడ్డిపాలెం, వెంటళాపురం, లిగసముద్రం, చినఅమ్మపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, అంకభూపాలపురం, తదితర గ్రామాల నుంచి పందెపురాయుళ్లు భారీగా చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. చినఅమ్మపాలెంకు చెందిన ఓ వ్యక్తి సహకారంతో ఈ పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులను మేనేజ్ చేయాలంటూ సదరు వ్యక్తి ఒక్కో పుంజు యజమాని నుంచి ఐదారు వందలు వసూలు చేస్తున్నారు.

రెండు రకాలుగా పందేలు

జిల్లాలో కోడి పందేలను రెండు రకాలుగా నిర్వహిస్తుంటారు. బరిలోకి దిగిన కోడి కాళ్లకు కత్తి కట్టి ఆ రెండు కోళ్లలో ఒకటి కింద పడేదాకా పందెం కాస్తారు. ఇక కత్తి కట్టకుండా బరిలోకి దింపిన కోళ్లలో ఒకటి కింద పడిపోవాలి. ఇలా రూ.వేల నుంచి లక్షల దాకా పందేలా కాస్తారు. ఈ యేడాది సంక్రాంతి బరిలో ఏయో ప్రాంతాల్లో ఎన్ని రూ.కోట్లకు పందేలు జరుగుతాయో!? ఎందరి జీవితాలు జూదం మత్తులో మునిగిపోతాయో వేచి చూడాలి.



విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులురెడ్డి, పక్కన వీసీ సూర్యతేజ తదితరులు

2041 వరకు మాస్టర్‌ప్లాన్

- రూపకల్పనకు విస్తృత చర్యలు
- ఓ కన్సల్టెన్సీతో సమావేశం
- నుడా చైర్మన్ కోటంరెడ్డి వెల్లడి

నెల్లూరు (జడ్పీ), జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)లో 2041 వరకు మాస్టర్ ప్లాన్‌ను రూపకల్పన చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం నుడా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కోటంరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ సర్కారు నుడా మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. నాలుగేళ్లుగా మాస్టర్‌ప్లాన్‌ను పెండింగ్‌లో పెట్టి గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. అభివృద్ధికి కీలకమైన మాస్టర్‌ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని, తాను వీసీ సూర్యతేజ, ఇతర అధికారులు కలిసి ఓ కన్సల్టెన్సీతో సమావేశమై మాట్లాడినట్లు తెలిపారు. నుడా పరిధిలోని 146 గ్రామాలు, 15మండలాల పరిధిలో 900 చ.కి.మీ మేర మాస్టర్‌ప్లాన్‌తో కన్సల్టెన్సీతో చర్చించి త్వరితగతిన నివేదిక తయారుచేసి ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. అలాగే బుచ్చిలో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు కాగుల పాడు నుంచి బుచ్చి టోల్‌గేట్ వరకు అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపైనా చర్చించినట్లు తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్ తయారైతే మంత్రి నారా యణ సహకారంతో నుడాను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కోటంరెడ్డి స్పష్టం చేశారు. వీసీ సూర్యతేజ మాట్లాడుతూ మూడు నెలల్లో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కన్సల్టెన్సీకి సూచించినట్లు చెప్పారు. మాస్టర్‌ప్లాన్‌లో రైల్వేలైన్లు పొందుపరచడమే గాక అన్ని ప్రాంతాలతో సమగ్ర మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు, రోడ్లు, పార్కులు, తదితర మౌలికసదుపాయాలకూ ఈ మాస్టర్‌ప్లాన్ ఉపయోగపడుతుందన్నారు.

నిషేధిత యాంటీబయోటిక్స్ అమ్మితే లైసెన్సులు రద్దు చేయండి : జేసీ



మాట్లాడుతున్న జేసీ కార్తీక్, పక్కనే వివిధ శాఖల అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): నిషేధిత యాంటీ బయోటిక్స్ అమ్మకాలు సాగించే వ్యాపార సంస్థల లైసెన్సుల రద్దుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మత్స్యశాఖ అధికారులకు ఆదేశించారు. ఆక్వా సాగులో నిషేధిత యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని అరికట్టే అంశంపై ఆయన అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రొయ్యల మేత, మందులు, ప్రోబయోటిక్స్ అమ్మకాలు చేస్తున్న దుకాణాలు, తయారీ దారుల ప్లాంట్లను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిషేధిత యాంటీ బయోటిక్స్‌ను రొయ్యల సాగులో వినియోగించడం వల్ల రొయ్యల ఎగుమతులు తిరస్కరణకు గురవుతున్నాయ న్నారు. దీనివల్ల రైతులు, ఎగుమతిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రతివారం విధిగా తనిఖీలు నిర్వహించి, నెలకొక సమావేశం నిర్వహించి ప్రగతిని సమీక్షించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మత్స్యశాఖ జేడీ ఎం.నాగేశ్వర రావు, నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, డ్రగ్ కంట్రోల్ ఏఈ వీరకుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు నీరజ, ప్రణతి ఫ్లోరా, మత్స్యశాఖ ఏడీ వీవీఆర్. బాబు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి సమాచారం అందించండి : మిశ్రా

ఎస్సీ ఉపకులాల వారీగా వారి స్థితిగతులపై పూర్తి సమాచారం అందచేయాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం తిక్కన భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, విద్యాపరం గానే కాకుండా రాజకీయంగాకూడా ఎస్సీల స్థితిగతులను కమిషన్ పరిశీలన చేస్తుంద న్నారు. అదే విధంగా ఎస్సీ లబ్ధిదారుల్లో ఉపవర్గాలను కూడా పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ కమిషన్ కోరిన విధంగా ఎస్సీ ఉపకులాల వివరాలతో సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్సీ కులాల సమగ్ర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఆనంద్ చైర్మన్‌కు వివరించారు. సమావేశంలో జేసీ కార్తీక్, ఎస్సీ సౌజన్య, డీఆర్‌వో ఉదయభాస్కర్, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



నేడు స్వర్ణాంధ్ర చైతన్య యాత్ర

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి): భారతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని గాంధీ బొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు స్వర్ణాంధ్ర చైతన్య యాత్ర ను నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ కార్యదర్శి ఎస్‌కే ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాటన్ సంచులను ప్రముఖ సామాజికవేత్త కుట్టి కుసుమకుమారి అందచేస్తారని, కార్యక్రమంలో డాక్టర్ కే శిఖామణి, కే కృష్ణయ్య, రమాదేవి పాల్గొంటారని తెలిపారు.

రేపు సీనియర్ పెన్షనర్లకు సన్మానం

ఏపీ ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు నగరంలోని రోటరీ ఆడిటోరియంలో సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్నామని ఆ అసోసియేషన్ అధ్య క్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు వినతుల వెల్లువ

- 363 అర్జీలు స్వీకరించిన చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- నెల్లూరు నగరంలో కులసంఘాల నేతలు ర్యాలీ



రాజీవ్‌రంజన్ మిశ్రాకు అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు



వినతిపత్రం సమర్పించేందుకు ర్యాలీగా వెళుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వినతులు స్వీకరించేందుకు నెల్లూరుకు వచ్చిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీ సం ఘాలు, ఇతర కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో అర్జీలు అందచేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహిం చారు. అనంతరం విన తులు స్వీకరించారు. పలువురు కుల సంఘాల నేతలు తమ అభి ప్రాయాలను చైర్మన్‌కు తెలిపారు. వర్గీకర ణకు అనుకూలంగా, వ్యతిరేకంగా 363 అర్జీలు అందచేశారు.

ర్యాలీలతో అర్జీల సమర్పణ

రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీలు ఎక్కువ సంఖ్యలో అర్జీలు సమర్పించారు. అర్జీలు సమర్పించడానికి ముందు ర్యాలీ లు నిర్వహించారు. సీమాంధ్ర ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వందిటి సుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి రాజీవ్‌రంజన్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా 59 కులాల కులగణన జరిపి, దామాషా ప్రకారం రిజర్వేషన్ల శాతం పెంచాలన్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్ ఫలాలు అనుభవించిన మాలలను సీ గ్రూపుగాను వర్గీకరణ చేయాలని కోరారు.

- మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో దళిత నాయకులు రంజన్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పును వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, బల్లి వెంయ్య, రొప్పోలు రఘు, పల్లం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.
- టీడీపీ ఎస్సీ సెల్ నేతలు కాకి ప్రసాద్, మాతంగి కృష్ణ తదితరులు కూడా మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కే నాగేశ్వరరావు, ఎన్ ఇజ్రాయిల్, పీ. పెంచలయ్య తదిరులు పాల్గొన్నారు.
- ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు బెల్లంకొండ గోపి మాదిగ, కోలగట్ల రమేష్ మాదిగ, విద్యార్థి సమైక్య నేత డాక్టర్ గోవింద సురేష్‌మాదిగ తదితరులు ర్యాలీగా వెళ్లి మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బద్దెపూడి వివేక్‌మాదిగ, చెరుకూరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. ఉదయ్‌కృష్ణ మాదిగ, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ర్యాలీగా కలెక్టరేట్‌కి వెళ్లి అర్జీలు సమర్పించారు.
- అలాగే వివిధ మాదిగ సంఘాల నాయకులు కొమ్మల కృష్ణయ్య, జనార్దన్‌రావు, గడ్డం శేఖర్ తదితరులు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ జాబితాలో 37వ నంబరుతో ఉన్న మాలదాసు ఉపకులాన్ని స్వతంత్ర కులంగా గుర్తించి నిత్యదాసుగా ఎస్సీ-డి విభాగంలో చేర్చాలని మాలదాసుల సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస పెరుమాళ్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. వారు సాంప్రదాయ వృత్తి వేషధారణతో అర్జీలు సమర్పించటం ఆకట్టుకుంది.

వెంగళాపురంలో పారిశుధ్య పనులు

లింగసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దోమల వ్యాప్తితో జ్వరాలు, ఇతరరోగాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెంగళాపురంలో శనివారం ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్‌లు పారిశుధ్య పనులు చేపట్టారు.అంతర్గత రోడ్ల వెంబడి, మురుగు కాలువల వెంబడి, వీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చిల్లచెట్లు, కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అలాగే కాలువలో నిల్వ ఉన్న మురుగు నీటిని చెత్తా చెదారాన్ని తొలగింప చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు మల్లికార్జునలు మాట్లాడారు. ఆదివారం బ్లీచింగ్ చల్లించి, ఎబేట్ మందు స్ప్రే చేయిస్తామన్నారు. రాత్రి అన్ని వీధుల్లో దోమలు నివారణకు ఫాగింగ్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబోయిన రత్తయ్య, చిట్టిబోయి న సుధాకర్, పొట్టిపాటి బ్రహ్మయ్య, లోమడ పెద్ద హనుమంతరావు పాల్గొన్నారు.

వైసీపీ నేత కృష్ణారెడ్డికి మాజీ మంత్రి పరామర్శ

లింగసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):పెంట్రాల పంచాయతీ రాళ్లపాడు వైసీపీ మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ వరికూటి కృష్ణారెడ్డిని శనివారం కందుకూరు మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన కృష్ణారెడ్డి సతీమణి వరమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వైసీపీ నేతలు బత్తిన మధుసూదనరావు, ఇంటూరి హరిబాబు, లక్ష్మీనరసింహ, పరిటాల వీరాస్వామి, వరికూటి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా జయకుమార్

కావలి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా జరుగుమల్లి జయకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారతీయజనతాపార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా ఆదివారం కావలిలో జరిగిన బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో ఈయన్ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకులు సీవీసీ సత్యం, మామిడి వెంకటేశ్వర్లు, నేతలు శ్రీనివాసులు, రం గారెడ్డి, క్రాంతికుమార్, కామాక్షి, సురేంద్ర, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అందించాలి

వలేటివారిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య అందించాలని కందుకూరు ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట తెలిపారు. ఈసీసీఈ దినోత్సవంపై శనివారం చెర్లోపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్‌ఎం రాజేంద్రకుమార్, కార్యకర్తలు రమ, భారతి పాల్గొన్నారు.

తగ్గిన నీటిమట్టం

లింగసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో శనివారం సాయంత్రానికి 20.8 అడుగులకు నీటిమట్టం ఉన్నది. గత నెల 31వ తేదీన ప్రాజెక్టు కుడి కాలువకు నీరు విడుదల చేసే సమయంలో ప్రాజెక్టులో 21అడుగుల మేర నీటిమట్టం ఉండేదని ఏఈ చంద్రమౌళి తెలిపారు. సోమశిల ప్రాజెక్టునకు ఉత్తర కాలువ ద్వారా ప్రాజెక్టులోకి 35 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్యే కాకర్లకు సన్మానం

సీతారామపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, దేవర వెంకటేశ్వర్లు శనివారం సన్మానించారు. వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకర్లను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో సమస్యలను ఆయనకు వివరించారు.

దివ్యాంగ పిల్లలకు భోజనం ఏర్పాటు

కందుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు సందీప్ జన్మదినం సందర్భంగా శనివారం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీల అధ్యక్షులు, పలువురు ముఖ్య నేతలు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో చిన్నారుల భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబరు గుర్రం మాల్యాద్రి, రాజ్యలక్ష్మి దంపతులు అన్నా క్యాంటీన్‌లో మూడుపూటలా భోజనం పెట్టించారు. వేడుకలలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, షేక్ రఫీ, శ్రీను, నరేంద్ర పాల్గొన్నారు.

విమర్శిస్తే హెచ్చరికలు

కందుకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వంపైన, స్థానిక ప్రజాప్రతినిధులపైన ఎవరైనా విమర్శలు చేస్తే వారిని పోలీసులు పిలిచి హెచ్చరికలు చేస్తుండటం శోచనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జోన్ కో ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు శనివారం ప్రకటనలో వాపోయారు. సామాన్యులు పరిస్థితి ఇక్కడ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?

- రోడ్లపైనే ఇళ్లలో వాడిన నీరు.. పేడదిబ్బలు
- పరిశుభ్రతకు ఆమడదూరంలో యాదవవీధి
- అంటురోగాలు ప్రబలుతాయని స్థానికుల ఆందోళన

జలదంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని యాదవ బజారు వీధిలోని రోడ్డు మురుగుకూపంలా మారింది. రోడ్డుకిరువైపులా నివసిస్తున్న ప్రజలు తమ ఇళ్లలో వాడిన నీరంతా రోడ్డుపైకి వదిలేస్తున్నారు. ఈ సమస్యతో నీరు రోడ్డుపైనే నిలిచి రోడ్డంతా మురుగుకూపంలా మారుతుంది. ఈ సమస్యను పంచాయతీ పాలకులు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు ఈ రోడ్డు పక్కనే గేదె లు కట్టేయడంతో పాటు పేడదిబ్బలు కూడా వేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు మరింత దుర్గంధంగా మారడంతో అటువైపు గ్రామస్థులు వెళ్లేందుకు జంకుతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లాలంటే మురుగు తొక్కుకుంటూ ఇళ్లలోకి వెళ్లాల్సి వస్తుందని వాతున్నారు. పారిశుధ్యం కొరవడటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని యాదవబజారు వీధి ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



జలదంకిలో రోడ్డుపైన పారుతున్న మురుగునీరు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

- ఎం.మల్లయ్య, సంగం ఎంఈవో -2

ఇంటర్వ్యూ...



సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూ ప్రకారమే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని ఆ మేరకు చర్య తీసుకున్నట్లు ఎంఈవో-2 మల్లయ్య తెలిపారు.

? ఏకోపాధ్యాయుడు సెలవు పెడితే ఎలా.

! మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 14 ఉన్నాయి. ఏకోపాధ్యాయుడు ఉన్న చోట సెలవు పెడితే ఆ కాంప్లెక్స్ పరిధిలో పనిచేసే సీఆర్పీ హాజరై పాఠశాల నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం. వారు ఆరోజు విధులు నిర్వర్తిస్తారు.

? అపార్ నమోదు ఎంతవరకు వచ్చింది.

! ఇప్పటివరకు 80శాతం పూర్తయింది. మిగిలిన వారికి పుట్టినతేదీ, ఆధార్ లేకపోవడం, ఉన్నా తప్పులు ఉండడంతో తేడా వస్తోంది. వాటిని సరిచేసి అపార్ నూరుశాతం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం.

? ఈ ఏడాది పాఠశాలలకు కాంపోనెట్ నిధులు వచ్చాయా.

! మొత్తం మంజూరు కాలేదు. 50 శాతం మాత్రమే మంజూరు చేశారు. ఆ నిధులతోనే పాఠశాలలో మరుగుదొడ్ల పరిశుభ్రత, మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.

విద్యలో రాణించిన వారికే ఉజ్వల భవిష్యత్తు

- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కొండాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశలో రాణించిన వారికే ఉజ్వల భవిష్యతు ఉంటుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరరం విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కళాశాల ఆవరణలో మొక్కను నాటి దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 175మంది విద్యార్థులకు భోజనప్లేట్లు, గ్లాసులు అందించిన టెలికమ్ అడ్వైజరీ మెంబర్ తాటికొండ అనూషను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్టయ్య, రైతు కార్యదర్శి పోలిసేని రమేష్, మండల మాజీ వైస్ చైర్మన్ పోలిసేని చంద్రబాబునా యుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు దాసరి అశోక్, నర్రా చెంచునాయుడు, నర్రా శివన్నారాయణ, జాగర్లమూడి శ్రీను, గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, కుంకు మోహనరావు పాల్గొన్నారు.



కొండాపురం : భోజనం పెట్టించుకుంటున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



బిట్రగుంట : భోజనం చేస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

● ఇష్టంతో కష్టపడి చదవాలి

బిట్రగుంట: ఇంటర్ విద్యార్థులు ఇష్టంతో చదివితే ఐదేళ్లలో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని ఈ విషయాన్ని గుర్తించుకుని కష్టపడాలని చదివాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కప్పరాళ్లతిప్ప ఇంటర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. రెండేళ్ల పాటు మధ్యాహ్నభోజనానికి తాండ్ర సతీష్ నాయుడు టీడీపీ మండల కన్వీనర్ మాలెపాటి నాగేశ్వరరావు, సహాయ సహకారాలు అందించారని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎంఈఓ జయమ్మ, టీడీపీ నేతలు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, రఘురామనాయుడు, ఉంటాల వెంకయ్య, మాధవరావు ఉన్నారు.

● దగదర్తి మండలంలో..

ఇంటర్ కళాశాలలో మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శ పమిడి రవికుమార్ చౌదరి, పార్టీ మండలాధ్యక్షుడు హనుమంతరావు పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వ రరావు సూచన మేరకు నాయకులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఇక్బాల్ అహ్మద్, దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, రఫీ, బెజవాడ ప్రసాదు ఉన్నారు.

● మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుచేయడం ఇంటర్ విద్యార్థులకు వరమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ అన్నారు. శనివారం కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఇచ్చిందని, తాజాగా ఈ పథకాన్ని అమలుచేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మాజీ చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఎంపీపీ కేతా వేణు గోపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి, చంద్రా వెంకట సుబ్బానాయుడు, శైలజారెడ్డి, బుజ్జిరెడ్డి పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు.

● మర్రిపాడు: స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపి అధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, ఎంఇవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక అల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కిరణ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఈ పథకం పునరుద్ధరించి మేలు చేసిందన్నారు. హెచ్‌ఎం బాలకేశవులు, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, నరసింహా, ఉప్పుటూరి వెంకటయ్య, సజిల్ శివకృష్ణ, కార్తీక్, తేజ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె వాణిశ్రీ



ఉదయగిరి: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, టీడీపీ నాయకులు

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిదులు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మండలంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, అన్నవరం-2 ఎంపీటీసీ సభ్యుడు కోర్శిపాటి మాధవరెడ్డిలు మాట్లాడారు. అన్నవరం ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి, కార్యదర్శులను వివరణ కోరారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు చేపట్టి, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవరప్పాడు పంచాయతీ సమస్యలపై టీడీపీ మండల నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డ బ్ల్యూఎస్, గృహనిర్మాణ, వ్యవసాయం, స్త్రీశిశు సంక్షేమం, ఉపాధిహామీ శాఖల్లోని పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో సోమశిల ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మధుమో హన్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మాల్యాద్రిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ తల్లపనేని మధుసూద నరావు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

అనంతసాగరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహ, ఐఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గుండ్లపల్లి'కి టీడీపీ శాశ్వత సభ్యత్వం

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా శనివారం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. దీంతో గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, కిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు, బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ్రెడ్డి రిత్విక్‌రెడ్డి ఉన్నారు.



మంత్రి ఆనం చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్

సంగంలో రెవెన్యూ సదస్సు

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సోమ్లా నాయక్ పాల్గొన్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, ఉపసర్పంచ్ తేజ, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు యాదవ్, గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కలువాయి, (ఆంధ్రజ్యోతి): మాదన్నగారిపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు ఉపాధి పనులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు భూమిలో పనులు చేపట్టేందుకు ఉపాధి సిబ్బంది వెళ్లగా ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధికి మారుపేరు 'మేదరమెట్ల'

జలదంకి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ దివంగత మేదరమెట్ల వెంకటక్రిష్ణారెడ్డి 10వ వర్ధంతిని శనివారం బ్రాహ్మణక్రాకలో ఆయన సతీమణి, జలదంకి జడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల ఆధ్వర్యంలో ఆయన అభిమానులు, పలుపార్టీల నాయకులు, గ్రామస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా నివాసప్రాంగణంలోని మేదరమెట్ల సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న మేదరమెట్ల విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి మాట్లాడారు. ఆయన చేసిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు క్రిష్ణారెడ్డి, రావి ప్రసాద్‌నా యుడు, మాజీసర్పం చ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, వైసీపీ నాయకులు చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, ఏగూరి పేతురు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

కొండాపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాలు కావాల్సిన వారు ముందస్తుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. మండలకేంద్రంలోని హౌసింగ్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. 2014 నుండి 2024 వరకు పెండింగ్ బిల్లుల బకాయిలు ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆదినారాయణ, హౌసింగ్ ఏఈ సల్మాన్ పీడీ వేణుగోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, సెంట్రల్ టెలికమ్ డైరెక్టర్ టి.అనూష పాల్గొన్నారు.

● లింగసముద్రం: హౌసింగ్ పీడీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం లింగసముద్రం-2, ఆర్ఆర్ పాలెంలలోని లేఅవుట్లలోని ఇసుక నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట డీఈ నారాయణరెడ్డి, ఏఈ నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్మల పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- డ్వామా పీడీ గంగభవాని

ఏఎస్ పేట, జనవరి4 (ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. శనివారం ఆమె మండలంలోని ఇందిరా జలప్రభ పొలాల రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మామిడి తోటలలో నీటి గుంతలు తవ్వడం ద్వారా సాగునీరు కొరతలేకుండా చేసుకోవచ్చని, ఇందుకోసం ఎన్ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో గుంతలు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. ఆదివారం మండలంలో వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ పర్యటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏపీడీ నారాయణరావు, అనుసముద్రం గ్రామ సర్పంచ్ కుడారి హజరత్తమ్మ, ఎన్ఆర్‌జీఎస్ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంసీ సభ్యులకు శిక్షణ

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఎంసీల విధులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పించారు.

స్వెట్టర్ల పంపిణీ

ఉదయగిరి: గండిపాళెం గ్రామానికి చెందిన జీఎంకే చారిటబుల్ ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి వితరణ చేసిన స్వెట్టర్లను శనివారం ట్రస్టు సభ్యులు గ్రామస్థులకు అందజేశారు.

ఎడ్లబండిని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

అనంతసాగరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎడ్లబండిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహేష్ అనే వ్యక్తికి గాయాలైన సంఘటన చిలకలమర్రి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఎద్దులకు గాయలయ్యాయి. బండి పూర్తిగా దెబ్బతింది. సమాచారం అందుకున్న 108 వాహనం అక్కడకు చేరుకొని గాయపడిన మహేష్‌ను ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. సోమశిల పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

న్యూస్ బాక్స్

నేత్రదానం

కందుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితితో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న నాగసూరి పద్మావతి నేత్రదానం చేశారు. ఆమె శుక్రవారం రాత్రి మృతిచెందగా కుటుంబసభ్యుల అంగీకారంతో సక్షమ్ ఆధ్వర్యంలో నెల్లూ రు మోడరన్ ఐ హాస్పటల్ వారు నేత్రాలను సేకరించుకుని వెళ్లారు. కార్యక్రమంలో సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు ఉన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళా

కందుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త, ప్రతి ఇంటికి ఒక జీవనోపాధి నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని యువతీయువకులంతా సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని మున్సిపల్ కమిషనర్ అనూష పిలుపునిచ్చారు. లైవ్లీ హుడ్ జాతర కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్స్ మేళా నిర్వహించారు. వందమందికి పైగా పాల్గొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో మెప్మా టీఈ కాంతయ్య, సీఓలు మాధవీలత, సురత్నకుమారి, ఆర్పీ సంధ్య, ఉప్పుటూరి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యవర్గంలో జిల్లా నేతలకు స్థానం

కందుకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీసీ జిల్లా కార్యవర్గంలో నియోజకవర్గం నుంచి ఏడుగురు నేతలకు స్థానం కల్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు తోకల కొండయ్యకు జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు ఇవ్వగా అధికార ప్రతినిధిగా ముప్పవరపు కిషోర్, ఉపాధ్యక్షుడిగా బిల్లా రమణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పిచ్చపాటి తిరుపతిరెడ్డి, పరిటాల వీరాస్వామి, సెక్రటరీ యాక్టివిటీలుగా చీమల వెంకటరాజ, కొండయ్యలకు అవకాశం కల్పించారు. పదవులు పొందిన వారు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌కు కృతజ్ఞత తెలిపారు.

ముక్కోటి ఏకాదశ కరపత్రాల ఆవిష్కరణ

కావలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముక్కోటి ఏకాదశికి సంబంధించిన కరపత్రాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుంతలో పడి మరణించిన విద్యార్థి తల్లిదండ్రులు గిరిబాబు, అమృత్‌లను శనివారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. బాలుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఉన్నారు.

చెక్క నగిషీ స్టాల్‌ను సందర్శించిన ఎంపీ వేమిరెడ్డి

ఉదయగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నోవెటల్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఏర్పాటు చేసిన ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం స్టాల్‌ను శనివారం నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు చెక్కనగిషీ వస్తువులను ఎంపీకి అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే

సంగం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే నిర్వహించారు. ప్రతినెలా 5వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు, కొలతలు తీసి రికార్డులో నమోదు చేస్తారు. ఈనెల 5వ తేదీ ఆదివారం రావడంతో ముందుగా శనివారమే ఈకార్యక్రమం నిర్వహించారు. రాళ్లచెలిక మిక్స్‌డ్ కాలనీలో జరిగిన కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ పద్మావతి పరిశీలించారు. అదేవిధంగా వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

బహుమతుల ప్రదానం

ఆత్మకూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వెస్ట్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం. వై సీతాదేవి పాల్గొన్నారు.